RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 270 శనివారం 25 అక్టోబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాల మూసివేత

రుద్రప్రయాగ్/ఉత్తరకాశీ : శీతాకాలం రావడంతో హిమాలయాల్లోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాలను ఉత్తరాఖండ్ అధికారులు మూసివేశారు. ఈ సందర్భంగా ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రుద్రప్రయాగ్ నుంచి కేదార్‌నాథుడి పల్లకి ఊరేగింపు ఆర్మీ మేళతాళాలు, సుమారు పది వేల మంది భక్తుల నినాదాల మధ్య ఘనంగా ప్రారంభమయింది. ఈ ఊరేగింపు శనివారం నాటికి ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర ఆలయానికి చేరుకోనుంది. మిగిలిన ఆరునెలల పాటు ఆ ఆలయంలో కేదార్‌నాథుడు పూజలందుకుంటాడు. ఈ ఉత్సవాల్లో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్ ఆలయాలను అధికారులు మూసివేయగా, బద్రీనాథ్ ఆలయాన్ని నవంబరు 25న మూసివేయనున్నారు.

మంచు, తీవ్రమైన చలి కారణంగా ప్రతి సంవత్సరం అక్టోబరు- నవంబరు నెలల్లో ఈ ఆలయాలను మూసివేసి ఏప్రిల్- మే నెలల్లో తిరిగి తెరుస్తారు.




# ప్రచార పర్వంలో నువ్వానేనా!

# అమీతుమీకి త్రిముఖ పోటీ!!

## కాంగ్రెస్.. బీఆర్ఎస్.. బీజేపీ రెఢీ

హైదరాబాద్ : తెలంగాణ రాజధాని హైదరాబాద్ సిటీ పరిధిలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. సాధారణంగా ఎక్కడ ఎన్నికలు జరిగినా రాజకీయ చదరంగం జరుగుతుంది. కానీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాత్రం రణరంగమే కాబోతుంది. 2008లో నియోజకవర్గాల పునర్విభజన భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పడింది. ఇక్కడ 2009లో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పి.విష్ణువర్ధన్ రెడ్డి విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2014లో తెలుగుదేశం అభ్యర్థి మాగంటి గోపినాథ్ విజయం సాధించారు. తెలుగుదేశం నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మాగంటి 2018లో కూడా బీఆర్ఎస్ అభ్యర్థిగా విజేతగా నిలిచిచారు. అదే పార్టీ అభ్యర్థిగా 2023లోనూ విజయం సాధించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికల్లో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ భార్య సునీత బీఆర్ఎస్ పార్టీ తరుపున నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ కుమార్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి నామినేషన్లు వేశారు. వీరితోపాటు 211 మంది 321 నామినేషన్లు వేశారు. రేపు నామినేషన్ల ఉపసంహరణకు ఎంత మంది బరిలో ఉంటారన్నది వేచి చూడాలి. ఎంత మంది ఉన్నా ఎన్నికలు మాత్రం ఈవీఎంను ఉపయోగిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఎంత మంది బరిలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ అనివార్యమని పరిశీలకులు భావిస్తున్నారు.

**అమీ తుమీ ..** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మూడు పార్టీలు అమీతుమీ తేల్చుకునే రీతిలో పోరాడుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్నకాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో చతికిల పడిన బీఆర్ఎస్ పార్టీ జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో తమ సత్తా నిరూపించుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కక నీరసపడిన బీఆర్ఎస్ ఈ సారి ఉప ఎన్నికల్లో తమ సిట్టింగ్ సీటును దక్కించుకోవాలన్న ప్రయత్నంలో ఉంది. ముందుగా టికెట్ ప్రకటించి, అవసరం అయితే ఉప ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును తీసుకు రావాలన్న ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు కేసీఆర్‌తో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు భేటీ అవుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నాయకులను తీసుకు వచ్చి ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి ఆ పార్టీ సన్నహాలు చేస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే సాధారణంగా ఉప ఎన్నికల్లో అధికారంలో ఏ పార్టీ ఉంటే వారికే ఓటర్లు పట్టం కడతారు. అయితే ఇక్కడ ఉన్న పరిస్థితులు వేరు. ఈ ఎన్నికను సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే పలువురు మంత్రులతో పలు మార్లు సమావేశమయ్యారు. ఈ ఎన్నికల ప్రచారానికి మంత్రులతోపాటు ఎమ్మెల్యేలను కూడా దించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిసింది. అందుకు ఓ ప్రణాళిక కూడా సిద్ధమైంది. ఈ నియోజకవర్గం సీటును దక్కించుకోవాలని ముమ్మరంగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రతిపక్షాల నోరు మూయించొచ్చు అని కాంగ్రెస్ భావిస్తోంది. బీజేపీ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది లోక్‌సభ స్థానాలు సంపాదించిన బీజేపీ అదే ఉత్సహంతో జూబ్లీహిల్స్ స్థానం దక్కించుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నం సాగిస్తోంది. గత ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్‌కు 80,549 (43.94%) ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌కు 64,212(35.03% ), బీజేపీ అభ్యర్థి 25,866 (14.11%) ఓట్లు లభించాయి. ఈ సారి జూబ్లీని ఎవరు దక్కించుకుంటారో ఎదురు చూడాలి.


# తెలుగు రాష్ట్రాలకు అలర్ట్.. నేడు భారీ వర్షాలు..





హైదరాబాద్: నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వర్షాకాలం ఇంకా ముగియలేదని.. మరి కొన్ని రోజులు వానలు కురుస్తాయని హెచ్చరించింది. వాస్తవానికి ఈ సమయానికి వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఈ సంవత్సరం మాత్రం అందుకు భిన్నంగా పలు జిల్లాలో ఇప్పటికే.. వానలు కురుస్తున్నాయి. తెలంగాణలోని నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి - భోంగిర్, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నేడు ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వివిక్త ప్రదేశాలలో భారీ వర్షాలు కురుస్తాయి పేర్కొంది. అలాగే.. హైదరాబాద్ నగరంలో ఇవాళ(శుక్రవారం) మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. కావున నగర ప్రజలు పనులు ముగించుకుని త్వరితగతిన ఇంటికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాలతో పాటు యానాంలో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమలోనూ పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోందని పేర్కొంది. ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇప్పటికే మోస్తారు వర్షం కురుస్తున్నట్లు సమాచారం. వర్షాల నేపథ్యంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అప్రమత్తం అయ్యాయి. ముందస్తు చర్యలకు సిద్ధం కావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

## తెలంగాణ రోల్ మోడల్ రాష్ట్రం.. విక్టోరియా ప్రతినిధుల ప్రశంసలు





హైదరాబాద్, అక్టోబర్ 24: ఆస్ట్రేలియాలో తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు పర్యటన కొనసాగుతోంది.

ఇందులో భాగంగా విక్టోరియా పార్లమెంట్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబుకు లెజిస్లేటివ్ కౌన్సిల్ గవర్నమెంట్ విప్ లీ తార్లామిస్, పార్లమెంటరీ సెక్రటరీ షీనా వాట్ ఘన స్వాగతం పలికారు. శాసన ప్రక్రియలు, పార్లమెంటరీ గవర్నెన్స్, పబ్లిక్ అకౌంటబిలిటీపై సుదీర్ఘంగా చర్చించారు. పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే పౌరుల భాగస్వామ్యం కీలకమని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు. టెక్నాలజీ ఆధారిత, పౌర కేంద్రిత పాలన వైపు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ - విక్టోరియా ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్ పెంచేందుకు చొరవ చూపుతామని మంత్రి తెలిపారు. అలాగే తెలంగాణలో అమలవుతున్న ప్రోగ్రెసివ్ లెజిస్లేటివ్ ప్రాక్టీసెస్, గవర్నెన్స్ రిఫార్మ్స్, డిజిటల్ ఇనీషియేటివ్స్‌ను విక్టోరియా ప్రతినిధులకు మంత్రి వివరించారు. ఇక... రాష్ట్రంపై విక్టోరియా నేతలు ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ రోల్ మోడల్ రాష్ట్రం అంటూ కొనియాడారు. ద్వైపాక్షిక సహకారం పెంపొందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా విక్టోరియా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# ఘోర విషాదం

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో అగ్ని ప్రమాదం...

# 20 మందికి పైగా మృతి!







కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర విషాదం చోటు చేసుకుంది. ఈరోజు ( అక్టోబర్ 24, 2025 ) శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద జాతీయ రహదారి 44పై అగ్నిప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ప్రమాద సమయంలో బస్సులో దాదాపు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు చెబుతున్నారు. మిగిలిన వారిలో 12 మంది స్వల్ప గాయాలతో బయటపడగా.. మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులను కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ అనూహ్య ఘటన ఏపీ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఏం జరిగిందంటే.. ప్రైవేట్ ట్రావెల్ బస్సు కర్నూలు నగర శివారులోని ఉలిందకొండ సమీపంలో బస్సు వెళ్తుండగా.. ఒక ద్విచక్రవాహనం బస్సును ఢీకొట్టింది. ఆ బైక్ బస్సు కిందకు దూసుకుపోయి ఇంధన ట్యాంకును తాకడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బస్సు అంతా వ్యాపించాయి. మంటలు చెలరేగిన సమయంలో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండగా.. అప్రమత్తమైన 12 మంది ప్రయాణికులు బస్సు అద్దాలను ధ్వంసం చేసుకుని కిందకు దూకేశారు. అయితే మిగిలిన వారు మంటల్లో చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మొత్తం 4 ఫైరింజన్లతో మంటలను అదుపు చేయగా బస్సు పూర్తిగా కాలిపోయింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ వాసులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం నుంచి బయటపడిన వారిలో రామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీలక్ష్మి, నవీన్‌కుమార్, అఖిల్, జష్మిత, అకీర, రమేష్, జయసూర్య, సుబ్రహ్మణ్యం సహా పలువురు ఉన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే బస్సులోని ఇద్దరు డ్రైవర్లు పరారైనట్టు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంపై దుబాయ్ పర్యటనలో ఉన్న సీఎం నారా చంద్రబాబు నాయుడు సైతం విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాడ సానుభూతి తెలియజేశారు. గాయపడిన, బాధిత కుటుంబాలకు ప్రభుత్వ అధికారులు అన్ని విధాలుగా సహాయం అందిస్తారని పేర్కొన్నారు. అలానే మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ అనూహ్య ఘటన ఎంతో కలిచి వేసిందని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించిన ఆయన.. వాళ్లకు ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు.

మరోవైపు ఈ బస్సు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ఆయన.. ఏపీ అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు.

**కర్నూలు బస్సు ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని, తెలుగు రాష్ట్రాల సీఎంలు దిగ్భ్రాంతి..!** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రాష్ట్రం మొత్తాన్ని విచారంలో నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద జాతీయ రహదారి 44పై అగ్నిప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. మిగిలిన వారిలో 12 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితులను కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, తెలుగు రాష్ట్రాల సీఎంలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రముఖుల సంతాపం.. కాగా బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్రపతి ముర్ము విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కూడా ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలన్నారు. అలానే ఏపీ లోని కర్నూలులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. ఈ విపత్కర సమయంలో తన ఆలోచనంతా బాధిత కుటుంబాల గురించేనని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని సంతాపం తెలిపారు. పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ. 2లక్షలు చొప్పున.. క్షతగాత్రులకు రూ. 50వేల చొప్పున పరిహారం ప్రకటించారు.

# సంపాదకీయం

## ఇవీ మన రాష్ట్రాల ఘనత

**ఏపీ లో 43.7% ప్రజలు, తెలంగాణ లో 37.2% ప్రజలు అప్పుల్లో ఉన్నారు..**

దేశవ్యాప్తంగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణంలో కేంద్ర గణాంకాల శాఖ తాజా సర్వే లెక్కలు తెలుగు రాష్ట్రాల పరిస్థితిని బహిర్గతం చేశాయి. ఈ నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు అత్యధికంగా అప్పుల భారంతో సతమతమవుతున్నారు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగా పేరున్న ఈ రెండు రాష్ట్రాలు ఇప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోయి కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.

**అప్పుల భారంలో అగ్రస్థానం...** 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సర్వే ప్రకారం, ఆంధ్రప్రదేశ్ (ఏపీ ) రాష్ట్రంలో ఏకంగా 43.7% మంది ప్రజలు అప్పుల్లో ఉన్నారు. ఈ సంఖ్య దేశంలోనే అత్యధికం కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మరోవైపు, తెలంగాణ రాష్ట్రంలో 37.2% మంది ప్రజలు అప్పుల్లో చిక్కుకున్నారని లెక్కలు చెబుతున్నాయి. దీంతో తెలుగు రాష్ట్రాలు వరుసగా మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి.

**ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌లో ఏపీ మెరుగ్గా ఉన్నా...** అప్పుల భారం ఉన్నప్పటికీ, ఆర్థిక సేవలు (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) వినియోగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మెరుగైన ప్రగతి సాధించింది. 15 ఏళ్లకు పైబడిన వారిలో 92.3% మంది బ్యాంకింగ్ వ్యవస్థలో భాగస్వాములయ్యారు. ఫైనాన్షియల్ ఇంక్లూజన్ రేటులో ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా రెండో స్థానంలో నిలిచింది. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రం 86.5%తో 14వ స్థానంలో నిలిచింది. దీని అర్థం ఏమిటంటే ప్రజలకు ఆర్థిక సేవలు అందుబాటులో ఉన్నా, అప్పుల భారం నుంచి బయటపడలేకపోతున్నారనే సంకేతం స్పష్టమవుతోంది. బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరించినా, ప్రజలు అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి కొనసాగుతోందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

**దక్షిణాది – ఈశాన్య రాష్ట్రాల పోలిక...** దక్షిణాది రాష్ట్రాల్లో సగటున 92.1% మంది ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నప్పటికీ, 31.8% మంది అప్పుల్లో ఉన్నారు. ఆర్థిక సేవలు అందుబాటులో ఉన్నా, ప్రజల ఆదాయాలు, ఖర్చులు సమన్వయం కావడంలో సమస్యలు ఉన్నాయనే విషయం ఇక్కడ స్పష్టమవుతోంది. దీనికి విరుద్ధంగా, ఈశాన్య రాష్ట్రాల్లో 80.2% మంది ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నప్పటికీ, కేవలం 7.4% మందికే అప్పులు ఉన్నట్లు సర్వే చెబుతోంది. అంటే ఆర్థిక సేవలు తక్కువగా ఉన్నా, ప్రజలు అప్పులలో చిక్కుకోకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని అర్థం.

**కుటుంబ పరిమాణం, సామాజిక వర్గాల ప్రభావం...** సర్వేలో కొన్ని ఆసక్తికర అంశాలు కూడా వెల్లడయ్యాయి. ఎక్కువమంది సభ్యులు ఉన్న కుటుంబాలపై అప్పుల భారం తక్కువగా ఉండగా, తక్కువమంది సభ్యులు ఉన్న కుటుంబాలు ఎక్కువగా అప్పుల్లో ఉన్నట్లు తేలింది. ఓబీసీల్లో 16.6% మంది, గిరిజనుల్లో 11% మంది అప్పుల్లో ఉన్నారు. పురుషులలో 89.8%, మహిళల్లో 84.5% మంది మాత్రమే ఆర్థిక సేవలను వినియోగిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

**సవాళ్లు, పరిష్కారాలు...** ఆర్థిక సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ప్రజల ఆదాయాలు పెరగకపోవడం, జీవన వ్యయం, ఖర్చులు పెరగడం వల్ల అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. ఈ ధోరణి తెలుగు రాష్ట్రాల్లో మరింత స్పష్టంగా కనబడుతోంది. బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరించినప్పటికీ, ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపడాలంటే... ఆర్థిక అవగాహన పెంపు, ఆదాయ వృద్ధి పట్ల ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. లేకపోతే, అప్పుల చక్రం ఆగే అవకాశం కనిపించడం లేదు. తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నా, ఈ అప్పుల భారం ప్రజల సుస్థిర ఆర్థిక ప్రగతికి పెద్ద సవాలుగా పరిణమించే ప్రమాదం ఉంది.

## అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను పరిశీలించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత







శామీర్ పేట, అక్టోబర్ 24 ( గరుడ వార్త) : బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను పరిశీలించారు. శుక్రవారం శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోనిసింగాయి పల్లి, హకీం పేట, తూంకుంట ప్రాంతాలలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీజీఎస్ సీపీసీఆర్) సభ్యురాలు గోగుల సరిత, మేడ్చల్ జిల్లా ఆర్టిఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్యా సదుపాయాలను, దుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది గదుల కొరత, ఉపాధ్యాయుల కొరత, టాయిలెట్ల నిర్మాణం పూర్తయినా బిల్లులు విడుదల కాకపోవడం వంటి సమస్యలను కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, పరానంది కృష్ణా, పరానంది బాల్ రాజు, మహమ్మద్ జాఫర్, వజ్జల శేశాంత్ (బన్నీ), నాయకులు యాదగిరి, నక్క మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరి వేసుకొని మృతి..



శామీర్ పేట, అక్టోబ ర్ 24 ( గరుడ వార్త) : మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం శామీర్ పేట మండలం అలియా బాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన నర్ల మల్లేష్ (38) వృత్తి కూలి. గురువారం మద్యం సేవించి ఇంటికి రాగా ఇలా మద్యం సేవిస్తే మనం ఎలా బతకాలని, పిల్లల్ని ఎలా పోషిస్తామని భార్య ప్రశ్నించింది.

ఇంటి నుంచి గ్రామంలో జరుగుతున్న సదర్ ఉత్సవానికి వెళ్లి అక్కడి నుంచి ఎవరికి చెప్పకుండా గ్రామ పరిధిలోని మేలకుంట సమీపంలోని ఓ తుమ్మ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు వెతకగా చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందికి దింపి పరిశీలించగా అప్పటికే మల్లేష్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఒత్తిడిలోంచి.. ప్రకృతి ఒడిలోకి..



హైదరాబాద్ : మహానగరం చెంతన ప్రకృతి లోగిళ్లు ఆహ్వానం పలుకుతున్నాయి. కుటుంబ సభ్యులతో గడిపేందుకు అనువుగా హెచ్ఎండీఏ పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసింది. రానున్న రోజుల్లో మరిన్ని ప్రకృతి వనాలను సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో శివారులో ఉన్న అందమైన ప్రకృతి వనాలను సందర్శించి వద్దాం..

**సిద్ధమైన ఏకో పార్కు.. పక్షి అక్వేరియం**

ఒకవైపు అవుటర్ రింగ్‌రోడ్డు.. పక్కనే హిమాయత్‌సాగర్.. దానికి ఆనుకొని అందమైన ఉద్యానవనం. 85 ఎకరాల్లో ఏకో పార్కును తీర్చిదిద్దారు. త్వరలో ప్రారంభించనున్నారు. ఆరు ఎకరాల్లో పక్షుల ప్రదర్శనశాల సిద్ధమైంది. దేశంలోని అరుదైన రకాలతోపాటు పెరూ, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, అమెరికా, న్యూజిలాండ్, జపాన్, చైనా దేశాల్లో కనిపించే అందమైన పక్షి రకాలను ఇక్కడ చూసే అవకాశం ఉంది.

**నాగారం.. సుందరం..** మహేశ్వరం మండలంలోని నాగారం వద్ద 556.69 హెక్టార్లలో ఈ అర్బన్ ఫారెస్టు పార్కు తీర్చిదిద్దారు. అవుటర్ రింగ్ రోడ్డులో పెద్ద గోల్కొండ(ఎక్సెట్ నెంబరు–15) వద్ద కిందకు దిగితే ఈ పార్కులోకి వెళ్లవచ్చు. సఫారీ ట్రాక్, ఎటు చూసినా పెద్ద పెద్ద చెట్లు..పక్షుల కిలకిలరావాలతో ఈ అర్బన్ ఫారెస్టు కనువిందు చేస్తోంది.

**అటు జలాశయం.. ఇటు సుందరవనం**

గండిపేట జలాశయం వద్ద సుందర ఉద్యానం నగరవాసులను అలరిస్తోంది. ఈ ల్యాండ్‌స్కేప్ పార్కును రూ. 35.60 కోట్ల వ్యయంతో తీర్చిదిద్దారు. వాక్ వేలు, ఆర్ట్ పెవిలియన్, ఫ్లవర్ టెర్రాస్, పిక్‌నిక్ స్పాట్‌లు, ఓపెన్ ఎయిర్ థియేటర్, కిడ్స్ ప్లే ఏరియా, ఫుడ్ కోర్టులు అందుబాటులోకి వచ్చాయి.

**పల్లెగడ్డ.. ఆహ్లాదానికి అడ్డా..**


మహేశ్వరంలోనే హర్షగూడ గ్రామానికి సమీపంలో 87 ఎకరాల్లో ఈ పార్కును అభివృద్ధి చేశారు. అవుటర్ రింగ్ రోడ్డులోని తుక్కుగూడ వద్ద (ఎగ్జిట్ నంబరు–14) నుంచి ఈ పార్కుకు చేరుకోవచ్చు. పచ్చదనంతో పార్కు అందాలు ఆకట్టుకుంటున్నాయి

**అందాల.. మన్యంకంచ**

కందుకూర్ మండలం లేమూర్‌లో మన్యంకంచ పార్కు 58.78 హెక్టార్లలో రూపుదిద్దుకుంది. అవుటర్‌లోని తుక్కుగూడ వద్ద ఎగ్జిట్ 14 నుంచి ఈ పార్కుకు చేరుకోవచ్చు.

**సిరిగిరిపూర్ అటవీ పార్కు..** అవుటర్ ఎక్సిట్–14 (తుక్కుగూడ) సమీపంలోనే ఈ పార్కును అభివృద్ధి చేశారు. సఫారీ ట్రాక్, విజిటర్స్ పాత్‌వే ఇతర మౌలిక వసతులు కల్పించారు. రకరకాల పక్షులు కనువిందు చేస్తాయి.

## శివారు.. బేజారు



కరీంనగర్ : జిల్లాలో కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల పరిధిలోని ఖాళీ స్థలాలు దుర్గంధానికి నిలయాలుగా మారాయి. ఇళ్ల మధ్య ఉండటంతో పారిశుధ్య పనులకు విఘాతం కలుగుతుండగా వాటిని శుభ్రం చేసుకోవడానికి స్థల యజమానులు ముందుకు రావడం లేదు. నగరంలో అయితే వందల సంఖ్యలో ఖాళీ స్థలాలున్నాయి. మురుగు, వర్షం నీరు నిలిచి దోమలకు ఆవాసంగా తయారైంది. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని చోట్ల ఇవి చెరువులను తలపిస్తున్నాయి.

**ఇక్కడ అధికం..**

నగరంలోని శివారు, విలీన గ్రామాల్లో ఎక్కువగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. అలకాపురి కాలనీ, కోతిరాంపూర్, పోచమ్మవాడ, ఆటోనగర్, లక్ష్మీనగర్, గాయత్రీనగర్, వావిలాలపల్లి, ఆదర్శనగర్, హుస్సేనీపుర, కిసాన్‌నగర్, కుర్మవాడ, సంతోష్‌నగర్, భగత్‌నగర్, సప్తగిరికాలనీ, మెహర్‌నగర్, పద్మనగర్, శ్రీహరినగర్, కొత్తయాస్వాడ, రేకుర్తి, బొమ్మకల్, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, మారుతీనగర్, రాంచంద్రాపూర్, వాసుదేవకాలనీ, టీఎన్‌జీవోఎస్, ఆర్టీసీ కాలనీ, సుభాష్‌నగర్, తీగలగుట్టపల్లి, సీతారాంపూర్ తదితర ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయి. ఇక్కడ ఖాళీ జాగాలను కొనుగోలు చేస్తున్న యజమానులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఎక్కువ శాతం విదేశాలకు వెళ్లిన వారే వీటిని కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. అపరిశుభ్రంగా ఉండటంతో శానిటేషన్ కార్మికులే శుభ్రం చేయాలనే డిమాండ్ స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది.

**పట్టని నోటీసులు**

ఖాళీ స్థలాల విషయంలో నగరపాలక సంస్థ పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం–2019 సెక్షన్ 161(1) ప్రకారం చర్యలు తీసుకునే వీలున్నా నిర్లక్ష్యం వీడటం లేదు. నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించినా ఆ దిశగా టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులు పట్టనట్లు ఉంటున్నారు.

**పేరుకే హెచ్చరిక బోర్డులు**

ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకోవాలని నగరపాలక సంస్థ గతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ సూచికలు నామమాత్రంగా మారి వాటికి వెచ్చించిన వ్యయం వృథా అయింది.

గతంలో కొందరికి రూ.10 వేల జరిమానా విధించగా ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను గుర్తించి శుభ్రం చేసుకునేలా యజమానిని ఒప్పిస్తే ప్రయోజనం ఉంటుంది.

## ఇక్కడ వృథా.. అక్కడ వ్యథ

కోదాడ : తుంగతుర్తి చెరువు అలుగు ఇది. దాని మీది నుంచి నీరు వృథాగా పారుతోంది. ఈ ప్రాంతంలో వానలు ఈ ఏడాది రాకపోయినా అలుగు పోస్తుందంటే ఎస్సారెస్పీ కాల్వ పుణ్యమే. కాల్వల మీద తూములు మూయకపోవడంతో నీరంతా ఇలా కిందికి పోయి చెరువులు అలుగు పోస్తున్నాయి.నీరు లేక కాల్వల్లో గడ్డి మొలిచి కనిపిస్తున్న ఈ ప్రాంతం మునగాల మండల పరిధిలోనిది. చివరి ఆయకట్టు వరకు ఎస్సారెస్పీ నీరు రావట్లేదు అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఇలా కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో 90 శాతం కాల్వలకు నీరు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్సారెస్పీ కాల్వలపై అధికారుల పర్యవేక్షణ కొరవడి నీరంతా వృథా అవుతోంది. ఫలితంగా చివరి వరకు నీరందక రైతులు బోర్లు, బావులు తవ్వుకొని ఆర్థికంగా నష్టపోతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టి సారిస్తే నీటి వృథాను అరికట్టవచ్చు. వారు నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీరు వెళ్లని దుస్థితి నెలకొంది. జిల్లాలో ఎన్నెస్పీ తర్వాత, ఎస్సారెస్పీ మీదనే ఎక్కువగా వరి సాగవుతోంది. ఎన్నెస్పీ పరిధిలో నీరు పుష్కలంగా చివరి ఆయకట్టు వరకు వెళుతుంటే, ఎస్సారెస్పీ పరిధిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**సూర్యాపేట, కోదాడకు చేరని నీరు..**

ఎస్సారెస్పీ పరిధిలో కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. తుంగతుర్తి నియోజకవర్గంలో



ప్రధాన కాల్వలకు ఉన్న తూములు ఇష్టారాజ్యంగా తెరుస్తుండటంతో రెండు నియోజకవర్గాలకు నీరు రావట్లేదు. తూములు సకాలంలో మూయట్లేదు. దీంతో నీరు పంట పొలాల మీదుగా సమీపంలోని చెరువుల్లోకి వెళ్తుంది. దీంతో నీటి కొరత ఏర్పడుతుంది. తుంగతుర్తి నియోజకవర్గానికి మాత్రమే నీరు అందుతుండగా, మిగతా ప్రాంతాల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

**క్షేత్ర స్థాయిలో పరిశీలించి అరికడతాం: సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎస్సారెస్పీ ఈఈ, తుంగతుర్తి**

నియోజకవర్గంలో కాల్వల మీద నీరు వృథా అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి వృథా వెళుతున్న ప్రాంతాలను గుర్తించి, తూములు మూయిస్తాం. సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు నీరు అందేలా చూస్తాం.

**అచ్చులు కట్టి నష్టపోయాం: నరేశ్ రైతు, తాడువాయి, మునగాల మండలం**

గతంలో పత్తి పంట సాగు చేశాం. రెండేళ్ల క్రితం కాల్వల్లో నీరు రావడంతో అచ్చు కట్టి వరి సాగు చేశాం. ఇప్పుడు నీరు రాకపోవడంతో అచ్చు కట్టిన భూమిలో మిగతా పంటలు పండించలేని దుస్థితి. నీటి కోసం బోర్లు వేసి ఆర్థికంగా నష్టపోయాం.


## మన ఖ్యాతి.. విశ్వవ్యాప్తి

మిర్యాలగూడ : చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలకు ఉమ్మడి జిల్లా పెట్టింది పేరు. పురాతన ఆలయాలు, నిర్మాణాలు, ఆధునిక కట్టడాలు కనువిందు చేస్తున్నాయి. ఏటా వందలాది మంది విదేశీ పర్యాటకులతో పాటు..లక్షలాది మంది దేశీయ సందర్శకులు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రదేశాలను సందర్శిస్తూ మంత్ర ముగ్ధులవుతున్నారు. ఇటీవల మిస్ వరల్డ్ పోటీదారులు సైతం పలు ప్రదేశాలను సందర్శించారు. నేడు 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా కథనం. కట్టిపడేసే సాగర్ కట్టడాలు

దేశంలోనే అతిపెద్ద ఆనకట్టల్లో ఒకటైన నాగార్జునసాగర్ డ్యామ్ ఉమ్మడి జిల్లాలో ఉండడం విశేషం. ఈ ప్రాంతంలో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండ, దానిపై ఉన్న పురావస్తు ప్రదర్శనశాల ఆకట్టుకుంటాయి. ఇక ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన బుద్ధవనం దేశ విదేశాల పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. సాగర్‌కు సమీప ఎత్తిపోతల జలపాతం, అనుపు, లాంచీ ప్రయాణం సైతం పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. మిస్ వరల్డ్ పోటీదారులు ఇటీవల బుద్ధవనాన్ని సందర్శించి సందడి చేశారు. చైనా, శ్రీలంక, టిబెట్, నేపాల్ తదితర దేశాలకు చెందిన బౌద్ధ మతస్థులు, యాత్రికులు వందల సంఖ్యలో సందర్శిస్తుంటారు. ఆలేరు మండలం కొలనుపాక జైన దేవాలయంతో పాటు..భువనగిరి కోటను సైతం అనేక మంది సందర్శిస్తుంటారు. జైన ఆలయాన్ని ఆధ్యాత్మిక, చారిత్రక, ఆర్కిటెక్చర్ రంగాల విదేశీ యాత్రికులు తరలివస్తుంటారు.

**ఆలయ విశిష్టత అద్భుతం**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పునర్నిర్మించిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. పురాతన ఆలయంతో పాటు కట్టడాలు భక్తులను, పర్యాటకులను సైతం



అబ్బురపరుస్తున్నాయి. మిస్ వరల్డ్ పోటీదారులు సైతం ఆలయాన్ని సందర్శించి పరవశించి పోయారు. ఇటీవల కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆలయం గొప్పతనాన్ని అభినందించారు. గతేడాది మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా సైతం ఆలయాన్ని సందర్శించారు. ఇటీవల జింబాబ్వే, నైజీరియాకు చెందిన ప్రతినిధులు ఆలయానికి వచ్చారు. ఏటా 150 మందికి పైగా విదేశీయులు గుట్ట ఆలయం, పరిసరాలను సందర్శిస్తున్నారు.

**పేరుగాంచిన పోచంపల్లి**

ప్రపంచ పర్యాటక గ్రామంగా పేరుగాంచిన భూదాన్ పోచంపల్లి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. 2021లో యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ పోచంపల్లిని ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపిక చేయడంతో.. గ్రామ ప్రత్యేకత ప్రపంచానికి తెలిసింది. అనేక పురాతన, అధునాతన వస్త్రాలకు ప్రసిద్ధి చెందిన గ్రామాన్ని ఇటీవల మిస్ వరల్డ్ పోటీదారులు సైతం సందర్శించారు. ఏటా పదుల సంఖ్యలో విదేశీ పర్యాటకులు గ్రామానికి వస్తుంటారు.

## విడుదలలో జాప్యం.. ఉపాధిపై ప్రభావం

బోయినపల్లి : మత్స్యకారుల జీవనోపాధికి జలాశయాలు, చెరువుల్లో చేప పిల్లలను ఏటా వదులుతుండగా.. ఈ ఏడాది జాప్యం నెలకొంది. ప్రతి సంవత్సరం ఆగస్టు లేదా సెప్టెంబరు నెలల్లో పంపిణీ చేస్తుండగా.. సకాలంలో వదలకపోవడంతో ఎదుగుదలపై ప్రభావం పడుతుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. జిల్లాలో బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద రాజరాజేశ్వర జలాశయం(మధ్యమానేరు), గంభీరావుపేట మండలం నర్మాలలో ఎగువమానేరు, ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద అన్నపూర్ణ, కోనరావుపేట మండలంలో మల్కపేట రిజర్వాయర్‌లు ఉన్నాయి. వీటితోపాటు ఎంపిక చేసిన చెరువుల్లో చేప పిల్లలను వేయాల్సి ఉంది.

**ఇటీవల పరిశీలించి వచ్చారు**

జిల్లాలో సుమారు 168 మత్స్యపారిశ్రామిక సంఘాలు ఉండగా.. 9526 మంది సభ్యులున్నారు. ఏటా చెరువుల్లో 35-40 ఎంఎం, జలాశయాల్లో 80-100 ఎంఎం బరువు గల రాహు, బంగారు తీగ, బొచ్చె రకం నెలరోజుల వయస్సు చేప పిల్లలను వదులుతున్నారు. వేసవికాలం వరకు జలాశయంలో చేపలు ఒక్కోటి సుమారు కిలో నుంచి 20 కిలోల బరువు పెరుగుతాయి. గత ఏడాది సకాలంలో పంపిణీ జరగక అనుకున్న లక్ష్యం చేరలేదు. మత్స్యకారుల ఉపాధిపై ప్రభావం పడింది. ఈ సంవత్సరంలో చేప పిల్లల విడుదల టెండర్ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ ప్రాంతానికి చెందిన గుత్తేదారుల వద్ద చేప పిల్లలను ఇటీవల అధికారులు పరిశీలించి వచ్చారు. గతేడు సకాలంలో చేప పిల్లలు విడుదల చేయకపోగా లక్ష్యం తగ్గించారు.

**విడుదల లక్ష్యం ఇలా..**



మధ్యమానేరు జలాశయంలో 28.50 లక్షలు, ఎగువ మానేరులో 10.50 లక్షలు, అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 13.69 లక్షలు, మల్కపేట రిజర్వాయర్‌లో 7.49 లక్షల వదలనున్నారు.

మల్కపేట జలాశయంలో మొదటిసారి వదలాలని అధికారులు నిర్ణయించారు.

44 శాశ్వత(నీరు నిల్వ ఉండే) చెరువుల్లో 20 లక్షలు, 410 వర్షాధారిత(సీజనల్) చెరువుల్లో 68.53 లక్షల చేప పిల్లలను పంపిణీ చేయనున్నారు.

గత ఏడాది తక్కువ వదిలారు

మధ్యమానేరు జలాశయంలో చేపల వేటతో ఉపాధి పొందుతున్నాను. అదను దాటుతున్న చేప పిల్లలను జలాశయంలో వదలలేదు. చేప ఎదుగుదలపై ప్రభావం పడి మా ఉపాధి దెబ్బతింటుంది. గత ఏడాది తక్కువ పిల్లలను వదిలారు.

దేవయ్య, మత్స్యకారుడు, కొదురుపాక

త్వరలోనే పంపిణీ జలాశయాలు, చెరువుల్లో త్వరలోనే చేప పిల్లలను వదలడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల పిల్లలను పరిశీలించి వచ్చాం. 148.71 లక్షలు వదలాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. లక్ష్యం మేరకు చెరువులు, జలాశయాల్లో వదులుతాం. సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

## సేవలు విస్తృతం.. శస్త్రచికిత్సల్లో ప్రథమం

పెద్దపల్లి : ప్రథమ చికిత్సలకే పరిమితమైన పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి.. కొన్ని రోజులుగా గణనీయమైన ప్రగతి కనబరుస్తోంది. ప్రసవాలతోపాటు శస్త్రచికిత్సల్లోనూ పురోగతి సాధించి, రాష్ట్రస్థాయిలో గుర్తింపు సాధించింది. మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందుతుండటంతో గడిచిన సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో 250 ప్రసవాలు జరిగాయి. ఇదే తరహాలో ఆర్థోపెడిక్, దంత వైద్యంతోపాటు సాధారణ శస్త్రచికిత్స లు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి. వైద్యవిధాన పరిషత్తు పరిధిలోని జిల్లా ఆస్పత్రుల్లో ఉత్తమ స్థాయిలో



వైద్య సేవలందుతున్నాయి. దీనికి పెద్దపల్లి ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు, శస్త్రచికిత్సలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.7.10 కోట్ల విలువైన ఆరోగ్య శస్త్రచిక్సితలు నిర్వహించారు.

అందుబాటులోకి ఎన్‌వీపీ పరీక్షలు

రోగికి వ్యాధి నిర్ధారణ జరిగితేనే చికిత్స సులభమవుతుంది. ఇదే సిద్ధాంతాన్ని ఇక్కడి వైద్యులు అనుసరిస్తున్నారు. ఇక్కడి టీ హబ్‌లో వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తుండటంతో ఆస్పత్రిపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ఈ క్రమంలోనే వివిధ రకాల వైద్యసేవలు పొందేందుకు ప్రజలు జిల్లా ఆస్పత్రిని ఎంపిక చేసుకుంటున్నారు. గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితి, కడుపులోని శిశువు గుండె స్థితిని తెలుసుకునే ఎన్‌ఎస్‌పీ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. టీపాస్కాన్, నవజాత శిశువు కేంద్రంలో వెంటిలేటర్లు, ఫొటో థెరపి యంత్రాలు, వార్మర్లు అందుబాటులో ఉన్నాయి. ఆర్థోపెడిక్, డెంటల్, కంటి చికిత్సలకు సంబంధించి అన్నిరకాల ఆధునిక యంత్ర పరికరాలతోపాటు ఫిజియోథెరఫికి సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

## ఉత్సాహమున్నా.. ప్రోత్సాహం కరవే!



పరిగి : మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు విశేషంగా కృషి చేస్తోంది. పెట్రోల్ బంకులు మొదలుకొని ఇటుకల తయారీ, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు వరకు అవకాశాలు కల్పిస్తోంది. జిల్లాలో మాత్రం ఇప్పటివరకు ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. వీటిని నిర్వహించాలన్న ఆసక్తి పొదుపు సంఘాలకున్నా.. క్షేత్రస్థాయిలో ఆ దిశగా అడుగులు మాత్రం పడటం లేదు. అధికారులు రేపుమాపంటూ కాలయాపన చేస్తున్నారు.

**పొరుగు జిల్లాలు భేష్..**

పక్క జిల్లాలైన నారాయణపేట, సంగారెడ్డి మాత్రం ముందంజలో దూసుకుపోతున్నాయి. రూ.లక్షల్లో వ్యాపారం నిర్వహిస్తున్నాయి. ఇక్కడ మాత్రం మహిళలు చిన్నాచితకా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. తొలి దశలో తాండూరు, వికారాబాద్ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తామని స్థలం పరిశీలించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారులు చెప్పినా ప్రారంభించడంలో జాప్యమవుతోంది. కొత్తగా దుద్యాల మండలం హకీంపేటలో ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఎన్‌ఓసీ రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన ఇటుకల తయారీకి మహిళతో బట్టీలు పెట్టించాలని ప్రభుత్వం నిర్ణయించినా అమలు కాలేదు. జిల్లాలో 11,681 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇటుక ఖరీదు రూ.8 వరకు ఉంది. ఇంటికి తీసుకొచ్చేసరికి అదనంగా మరో రూ.2 అవుతోంది. మహిళలే తయారు చేస్తే కొంతవరకైనా భారం తగ్గుతుంది.

పూడూరు మండలం రాకంచర్ల దగ్గర గార్మెంట్ సిటీ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉంది. ప్రభుత్వం పరిశ్రమల కోసం కేటాయించిన ఉచిత భూమి, మిషన్ భగీరథ నీరు, విద్యుత్తు, రోడ్లు జాతీయ రహదారికి దగ్గరలోనే ఉన్నాయి. పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే ఏర్పాటుకు పరిశీలించే అవకాశముందని పలు సంఘాలు కోరుతున్నాయి.

**ఏర్పాటుకాని సౌరశక్తి యూనిట్లు..**

కోట్‌పల్లి, బషీరాబాద్ మండలాల్లో సౌరశక్తి యూనిట్లు నెలకొల్పుతామని డీఆర్డీఏ అధికారులు ఊదరగొట్టారు. ఇందుకోసం రూ.2 కోట్లు వెచ్చిస్తున్నట్లు ప్రకటించినా అమలు కాలేదు.

**చర్యలు తీసుకుంటున్నాం.. - కొమరయ్య, డీపీఎం**

వివిధ రంగాల్లో మహిళల ఉన్నతికి కృషి చేస్తున్నాం. పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లకు ప్రతిపాదించాం. ఒకదాని తరవాత మరోటి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మండలాలు: 20 మండల సమాఖ్యలు: 19

గ్రామ సమాఖ్యలు: 657

స్వయం సహాయక సంఘాలు: 15,697

నమోదైన సభ్యులు: 1.63 లక్షలు

## నిధుల లేమి.. అభివృద్ధి నిలిచి..



వికారాబాద్ : జిల్లాలో మూడేళ్లుగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీల్లేక పర్యవేక్షణ కరవైంది. జడ్పీ ఛైర్మన్లు, ఎంపీపీల పదవీకాలం ముగిసి ఏడాదికిపైనే అయింది. కొత్తగా కమిటీలు ఏర్పాటు చేయలేదు. దీంతో చాలావరకు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

**మంజూరు లేదు..:**

పభుత్వ ఆసుపత్రులకు సర్కారు సరిపడా నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వైద్యాధికారులు వాపోతున్నారు. ప్రతి మూణ్నెల్లకోసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు. సమావేశమైనా నిధుల కొరతతో ఫలితం ఉండదనే భావనతో ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పీహెచ్‌సీలకు ఏటా రెండు పర్యాయాలు కలిపి సుమారుగా రూ.1.50 లక్షల నిధులు మంజూరు చేస్తారు. అభివృద్ధి కమిటీ ఆమోదం మేరకు వాటిని వసతుల కల్పనకు వినియోగిస్తారు.

**ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏదీ..**

వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. రెండేళ్ల కిందట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మార్చారు. మే నెలలో రూ.30 కోట్లతో నిర్మించిన భవనంలో సేవలు ప్రారంభించారు. నిర్వహణ బాధ్యతలు అన్ని ప్రభుత్వ వైద్య కళాశాల వారు తీసుకున్నారు. ప్రత్యేకంగా వైద్య కళాశాలకు సంబంధించిన పర్యవేక్షకుణ్ని నియమించారు. ప్రత్యేక వైద్య నిపుణులు ఇక్కడ సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీని మాత్రం ఏర్పాటు చేయలేదు.

**ఎన్నికల తర్వాత అవకాశం.. - డా.రవీందర్ యాదవ్, జిల్లా ఉప వైద్యాధికారి, వికారాబాద్**

జిల్లాలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీలు ఎన్నికల తర్వాత ఏర్పాటు చేసే అవకాశాలు అధికంగా ఉన్నాయి. జిల్లా ఆసుపత్రికి జిల్లా పరిషత్తు ఛైర్మన్, సివిల్ ఆసుపత్రులకు ఎమ్మెల్యేలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మండల పరిషత్తు అధ్యక్షుడు ఛైర్మన్‌గా ఉంటారు. ఛైర్మన్లు లేకుండా కమిటీ ఏర్పాటు కుదరదు.

ఏర్పాటు కాని జిల్లా ఆసుపత్రి: 1

సామాజిక ఆరోగ్య కేంద్రాలు: 3

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి: 1

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 23

బస్తీ దవాఖానాలు: 4

అర్బన్ దవాఖానాలు: 2 కమిటీలు

## మత్తు దందా.. కొత్త పంథా

హైదరాబాద్: మత్తు దందా కొత్త దారులు తొక్కుతోంది. స్మగ్లర్లు.. కొత్తగా ప్రైవేటు కొరియర్లు, పార్సిల్ డెలివరీ సర్వీసులను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా సింథటిక్‌డ్రగ్స్(హెరాయిన్, కొకైన్, ఎండీఎంఏ తదితరాలు), హైడ్రోఫోనిక్, ఓజీ గంజాయి లాంటి ఖరీదైన మత్తు పదార్థాలు ఈ విధానంలో రవాణా చేస్తున్నట్లు తెలంగాణ ఈగల్ గుర్తించింది. ఎక్కువ మొత్తంలో రవాణా చేస్తే తనిఖీలకు పట్టుబడతామనే ఉద్దేశంతో చిన్నపాటి కొరియర్ల ద్వారా రాష్ట్రాల సరిహద్దులు దాటించేస్తున్నారు. ఇటీవల నగరంలోని ఓ ప్రైవేటు వర్సిటీలో విద్యార్థులు గంజాయి రవాణా, వినియోగాన్ని ఈగల్ బట్టబయలు చేసిన సంగతి తెలిసిందే. విద్యార్థులకు గంజాయి ఎలా వస్తోందని పోలీసులు ఆరాతీయగా దిల్లీ, కర్ణాటక నుంచి కొరియర్ల ద్వారా వస్తున్నట్లు బయటపడింది. ఈ కేసు అనంతరం.. డ్రగ్స్ రవాణా మీద దృష్టి సారించగా ఎక్కువ మంది స్మగ్లర్లు కొరియర్ ఏజెన్సీలను ఉపయోగిస్తున్నట్లు వెలుగుచూసింది. ఏజెన్సీల ఉద్యోగులకు ఇందులో ప్రమేయమున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**తప్పుడు చిరునామాలతో..**

కొంతకాలంగా బస్సులు, ప్రైవేటు వాహనాలు, ఇతర మార్గాల్లో తనిఖీలు పెరిగాయి. ఇదే సమయంలో కొరియర్లపై నిఘా తక్కువగా ఉండడం స్మగ్లర్లకు అవకాశంగా మారుతోంది. సరకును చిన్న మొత్తాలుగా



విభజించి వివిధ వస్తువుల మాటున కొరియర్ చేస్తున్నారు. పోలీసులకు అనుమానం రాకుండా జాగ్రత్తపడుతున్నారు. సాధారణంగా కొరియర్ పంపినప్పుడు డెలివరీ చిరునామా స్పష్టంగా ఉండాలి. డ్రగ్స్ ముఠాలు చిరునామాలో ప్రాంతం పేరు ఇస్తున్నా ఇల్లు, ఆఫీసు, భవనం పేర్లు అస్పష్టంగా పేర్కొంటున్నారు. దీంతో డెలివరీబాయ్‌లు తప్పని పరిస్థితుల్లో ఫోన్ నంబరుకు కాల్‌చేస్తారు. దీంతో రిసీవర్లు సమీపంలోని మరో ప్రాంతానికి రప్పించి తీసుకుంటున్నారు. ఈ కొరియర్ పార్శిళ్లలో అత్యధికం గోవా, దిల్లీ, బెంగళూరునుంచే వస్తున్నాయి.

## దిగుబడి సగమే.. దినదిన గండమే!

ఖమ్మం: అధిక వర్షాలు పత్తి రైతులను నట్టేట ముంచాయి. ఆగస్టు వరకు విరగబూసిన పూత, కాతతో పచ్చగా కళకళలాడిన పైర్లు ఆ తరువాత కురిసిన వానలకు దెబ్బతిన్నాయి. ఎండలు కాయక.. సూర్యరశ్మి తగలక వేరుకుళ్లి సోకి చెట్లు నిలువునా ఎండిపోయాయి. పూత రాలింది. నీళ్లు చేరటంతో కాయలు నల్లగా మారాయి. దిగుబడి సగానికి పడిపోవటంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.

**భారంగా పెట్టుబడి..**

ఖమ్మం జిల్లాలో 2,34,182 ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 2,21,345 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఒక్కో ఎకరాకు సగటున రూ.30,450(ఏరివేత కూలి కాకుండా) పెట్టుబడి పెట్టారు. భారీ వర్షాల కారణంగా దసరా ముందు పత్తిని ఏరలేదు. జనవరి వరకు



మూడుసార్లు తీయాల్సి ఉండగా ఒక్కసారి ఏరివేతనే కష్టమైంది. ఫలితంగా సగటు దిగుబడి ఐదున్నర క్వింటాళ్లకు పడిపోయిందని కర్షకులు చెబుతున్నారు. వర్షాలకు లోతట్టు భూముల్లోని పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. వేరుకుళ్లు సోకిన చేలల్లో ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల దూది మాత్రమే పండింది. క్వింటాకు కనీస మద్దతు ధర రూ.8,150 కాగా.. అంతటా సీసీఐ కొనుగోళ్లు మొదలుకాకపోవటంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు సగటున రూ.6వేలకే కొంటున్నారు. ఈలెక్కన ఐదున్నర క్వింటాళ్లకు రూ.33వేలు వస్తున్నాయి. ఇందులో ఏరివేత కూలీల ఖర్చులు క్వింటాకు 1,500 చొప్పున రూ.8,250 పోతే రూ.24వేలు మాత్రమే మిగులుతున్నాయని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడత దూది తీయగా.. చెట్టుకు ఉన్న కాయలకు గులాబి పురుగు ఆశించటంతో అవి పనికి రాకుండా పోతున్నాయి. లింగాకర్షక బుట్టలు పెడితే ఫలితం ఉంటున్నా రైతులు నిరాశతో వదిలేస్తున్నారు.

సొంత భూమి నాలుగెకరాలతోపాటు ఎకరాకు రూ.25వేల చొప్పున ఆరెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగుచేశాను. రూ.4.50లక్షలు ఖర్చుపెట్టాను. 58 క్వింటాళ్ల పత్తి వచ్చింది. ఏరివేతకు రూ.87వేలు వెచ్చించాను. సీసీఐ కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర దొరుకుతుందని వేచిచూస్తున్నా. ఇంకా చెట్టుకు కాయలున్నా.. గులాబి పురుగు ఆశించటంతో వదిలేశాను.

కందుల భాస్కర్‌రావు, వెంకటాపురం, (ముదిగొండ)

ఎకరాకు రూ.20వేల చొప్పున మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశాను. రూ.72వేలు ఖర్చుచేశాను. వర్షాలకు గడ్డి పెరగటంతోపాటు ఎర్రపేను కారణంగా ఆకు ముడుచుకుపోయి పూత, పిందె రాలిపోయింది. చేను ఎదగలేదు. అధిక వానలకు కాయలు నల్లగా మారాయి. ఎకరాకు మూడు క్వింటాళ్ల పంటపోగా ఎనిమిది క్వింటాళ్ల దిగుబడే వచ్చింది.

పారెపల్లి రమేశ్, ముదిగొండ

ఒక ఎకరా పత్తి సాగుకు పెట్టుబడి (రూ.లల్లో)

విత్తనాలు: 3,800

ప్లవ్, రొటావేటర్: 5,500

గొర్రు, గుంటుక: 6,000

కూలీలకు: 3,200

ఎరువులు: 3,950

పురుగుమందులు: 8,000

## ఉపాధి పనులు.. 39 రకాలు

అశ్వారావుపేట: ఉపాధి పథకానికి సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల గుర్తింపు కోసం ఈనెల 17 నుంచి గ్రామసభలు చేపట్టారు. నవంబర్ 30 లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం జాబ్‌కార్డులకు సంబంధించిన ఈకేవైసీ కార్యక్రమం జరుగుతుండగా మరోవైపు పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గ్రామసభలు ఈనెల 2 నుంచి నిర్వహించాల్సి ఉండగా అప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాధ్యం కాలేదు. తాజాగా అధికారులు సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం గ్రామసభలు కొనసాగుతున్నాయి.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కూలీలు**



గ్రామాల్లో పనులు చేసే కూలీల సంఖ్యకు అనుగుణంగా పనులు గుర్తిస్తారు. ఉపాధి పథకం కింద 250 రకాల పనులు నిర్వహించవచ్చు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 39 రకాల పనులు చేసేందుకు మాత్రమే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వీటికి ప్రజాభిప్రాయం ప్రకారం ఆమోదం తీసుకోనున్నారు. గుర్తించిన పనులను మొదట మండల పరిషత్తు, తదుపరి జిల్లాస్థాయి అధికారులకు పంపి ఆమోదం పొందాలి. ఇప్పటికే గుర్తించిన పనులను 2026 మార్చి 31 వరకు పూర్తి చేయాలి. ఏప్రిల్ 1 నుంచి కొత్తగా గుర్తించిన పనులు మొదలు పెట్టాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇందిరమ్మ ఇళ్లకు ఉపాధి హామీ కూలీల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల లబ్ధిదారులకు మేలు జరగటమే కాకుండా నిర్మాణాలు ఊపందుకునే అవకాశం ఉంది. నీటి కుంటలు, కుంటల్లో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు, ఇంకుడుగుంతల నిర్మాణం, పశువుల పాకలు, పంచాయతీ నర్సరీల్లో మొక్కల పెంపు, పండ్ల తోటలు, పశుగ్రాసం పెంపకం, నీటి మళ్లింపు కాలువలు, సీసీ రహదారులు, మట్టి రోడ్ల నిర్మాణం, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణ పనులు చేపడతారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించేలా కసరత్తు చేస్తున్నాం. ఇందు కోసం పక్కా ప్రణాళికలు రూపొందించాం. రైతలు, కూలీలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యమిస్తున్నాం. రవి, ఏపీడీ

# ఎల్ఆర్ఎస్ అనేదెప్పుడు?

కరీంనగర్ : జిల్లాలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) దరఖాస్తులపై నిర్లక్ష్యం వీడటం లేదు. దరఖాస్తులను పరిష్కరించి ఆదాయం రాబట్టడానికి కౌంటర్లు, ప్రచారం చేయడం, రాయితీ ప్రకటించడంతో అర్హులైన వారంతా ఫీజు రూపంలో చెల్లించారు. అనంతరం ప్రొసీడింగ్స్ జారీ చేసే సమయంలో దరఖాస్తుదారులకు చుక్కలు చూపించారు. లేనిపోని కొర్రీలుపెట్టి పట్టణ ప్రణాళిక, నీటిపారుదల, రెవెన్యూ అంటూ ఎవరికి వారు దాటవేసే ధోరణి అవలంభిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలించని అధికారులు**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించి ఆమోదించడానికి క్షేత్రస్థాయిలో పట్టణ ప్రణాళిక, పంచాయతీ కార్యదర్శులు స్పందించడం లేదు. ఎల్–1, ఎల్–2 లాగిన్‌లో ఉండగా మూడు శాఖల పరిధిలో ఆ అర్జీ ఎక్కడుందో తెలియని గందరగోళం నెలకొంది. దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించినప్పటికీ అధికారులు వాటిని పరిష్కరించకపోవడంతో అలాగే వదిలేశారు. టౌన్‌ప్లానింగ్, పంచాయతీ కార్యదర్శుల వద్దకు వెళ్తే రేపు, మాపు అంటూ తిప్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్‌లో పెండింగ్‌లోని దరఖాస్తులు పరిశీలించాలంటే నానాఅవస్థలు పడుతున్నారు.

**స్థల యజమానులకు సమాచారం**

సుడా, నగరపాలిక పరిధిలో ఫీజు చెల్లించి ఇప్పటి వరకు ప్రొసీడింగ్స్ రాని స్థల యజమానులు అప్లికేట్ లాగిన్లు చూసుకోవడం లేదు. కొందరికి తిరిగి డాక్యుమెంట్లు లోడ్ చేయాలని, మరికొందరికి అవసరమైన పత్రాలు జత చేసి తిరిగి పంపించాలని తెలిపినా ఎవరూ సమాచారం ఇవ్వడం లేదు. నిర్ణీత గడువులోగా పరిష్కారానికి రాకపోతే



అలాంటి దరఖాస్తులన్నీ తిరస్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. క్రమబద్ధీకరణ కోసం చెల్లించిన మొత్తంలో 10 శాతం మినహాయించుకొని ఆ తిరస్కరించిన దరఖాస్తుదారులకు చెల్లించాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా సాంకేతికపరమైన మార్పులు చేస్తున్నట్లు అధికారవర్గాల సమాచారం.

**సాధారణ స్థలాలకు ఎన్‌వోసీలా?**

నగరపాలక సంస్థ పరిధిలో ఇళ్ల మధ్య, రిజిస్ట్రేషన్ శాఖలో ఎలాంటి అభ్యంతరాలు లేని స్థలాలను కొందరు అధికారులు గూగుల్ మ్యాప్‌లో చూసి ఎన్‌వోసీలు సమర్పించాలని షార్ట్‌ఫాల్ రాస్తున్నారు. క్షేత్రస్థాయిలో కొర్రీలు పెట్టకుండా ఉండాలంటే ఎంతో కొంత సమర్పిస్తే అన్నీ సవ్యంగానే ఉంటాయని, లేదంటే ఎన్‌వోసీలు గుర్తుకు వస్తాయని పలువురు అర్జీదారులు ఆరోపిస్తున్నారు.

**త్వరగా పరిష్కరించాలి**

లేఅవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా అధికారులను ఆదేశించాం. డాక్యుమెంట్లు సరిగా లేకపోతే మళ్లీ సమర్పించాల్సి ఉంటుంది. సాంకేతిక సమస్యలు అధిగమిస్తూ పెండింగ్‌లో లేకుండా చూడాలి. ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

# సామగ్రి ఇచ్చారు.. సార్లు లేరు!

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా కార్యక్రమాలు కనుమరుగవుతున్నాయి. కళాశాలలకు మైదానాలు లేకపోవడం, ఉన్న వాటిని సద్వినియోగపర్చుకోలేని పరిస్థితులు ఉండటం ఇందుకు కారణం. ఉమ్మడి జిల్లాలో మెజారిటీ కళాశాలల్లో మైదానాలే లేకపోగా కళాశాలల్లో కేవలం ఒక్క ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) మాత్రమే పని చేస్తుండటం వ్యాయామ విద్యకు పట్టిన దుర్గతిని చూపుతోంది. ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి శనివారం క్రీడా కార్యక్రమాల నిర్వహణ పీరియడ్లను కేటాయిస్తూ క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.10 వేల చొప్పున ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు నిధులు అందించడం గమనార్హం. మైదానాలు, పీడీలు లేని పరిస్థితుల్లో క్రీడా పరికరాలు ఎలా సద్వినియోగం చేసుకుంటారనే విషయమై అధికారులు దృష్టి సారించడం లేదు.

**ఇదీ పరిస్థితి..**

కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాలలో మాత్రమే పీడీ ఉండగా, ఇక్కడ మైదానం లేదు.

కొన్ని కళాశాలల్లో మైదానాలు ఉన్నా రూపురేఖలు కోల్పోయాయి. ఆట విడుపుగా కూడ ఆడుకునేందుకు అనువైన ఆట స్థలాలు లేవు.

మెజారిటీ కళాశాలల్లో క్రీడా సామగ్రిని విద్యార్థులు ఆటవిడుపుగా ఆడుకునేందుకు వినియోగిస్తున్నారు.

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అండర్ –19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభమైనా విద్యార్థులు దూరంగా ఉంటున్నారు.

సొంత ఆసక్తితో కొందరు విద్యార్థులు పాల్గొంటున్నా వారి ప్రతిభను ప్రోత్సహించే చర్యలు, తర్ఫీదు లేని కారణంగా రాష్ట్ర స్థాయికే పరిమితమవుతున్నారు. ఈ దుస్థితిని తప్పించేందుకు ప్రభుత్వం పీడీలను శాశ్వత



ప్రాతిపదికన లేదా ఒప్పంద పద్ధతిలోనైనా నియమించాలనే డిమాండ్ క్రీడాకారులు, తల్లిదండ్రుల నుంచి ఉంది. క్రీడా పరికరాలను కొనుగోలు చేయించి చేతులు దులుపుకొన్న ఉన్నతాధికారులు ఆటగాళ్లు వాటిని వినియోగించి ఎదిగేలా కళాశాలల్లో చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిధులు.. నిరుపయోగంగా పరికరాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 52 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వాటిల్లో సుమారు 16,715 మంది విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలల విద్యార్థులకు విద్యాశాఖ ప్రత్యేకంగా అండర్–19 క్రీడా పోటీలను నిర్వహించడంతోపాటు క్రీడాకారులు పొందే ధ్రువపత్రాలకు ఉన్నత విద్యావకాశాల్లో స్పోర్ట్స్ కోటా వర్తింపజేస్తోంది. దీంతో గ్రామీణ క్రీడాకారులు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు. ఇంటర్ బోర్డు చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ఈ విద్యా సంవత్సరం ప్రతి శనివారం క్రీడా కార్యక్రమాలు నిర్వహించడానికి షెడ్యూల్‌ను ప్రకటించారు. క్రీడా పరికరాల కోసం ప్రతి జూనియర్ కళాశాలకు జూన్‌లో రూ.10 వేల చొప్పున ఉమ్మడి జిల్లాలోని 52 కళాశాలలకు రూ.5.20 లక్షల నిధులను అందించారు. పీడీలు, మైదానాలు లేని కారణంగా పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి.

# లక్ష్యం.. సాకారంలో నిర్లక్ష్యం



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నగర, పురపాలికల్లో చేపట్టిన మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్ల లక్ష్యం నెరవేరడంలేదు. నాలుగేళ్ల కిందట పన్నెండు నగర, పుర పాలికల్లో ఎఫ్ఎస్‌టీపీ(ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మాణాలకు ప్రతిపాదించారు. రెండేళ్ల కిందట స్థలాలు ఎంపిక చేసి అప్పగించారు. ఆరు నెలల కిందట నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయిదు చోట్ల పనులు పూర్తి చేయగా, మరికొన్ని తుది దశలో పనులు ఆగిపోయాయి. కొన్ని చోట్ల ప్రారంభించలేదు.

**ఇళ్ల నుంచి నేరుగా ఇక్కడికే..**

ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయగా వెలువడిన మానవ వ్యర్థాలను శుద్ధి కేంద్రానికి తరలిస్తారు. అక్కడ యంత్రాలు, గ్రావిటీ ద్వారా వివిధ దశల్లో వేరు చేస్తారు. అందులో నుంచి వచ్చే నీటిని మొక్కలకు వినియోగించడం, చెరువులకు వదలడంతోపాటు ఘన వ్యర్థాలతో ఎరువు తయారు చేస్తారు. కరీంనగర్‌లో భూగర్భ మురుగు శుద్ధి కేంద్రంలోనే సెప్టిక్ వ్యర్థాలు వేస్తున్నారు. మానవ వ్యర్థాలనూ అందులోనే శుద్ధి చేస్తున్నారు. ఎఫ్ఎస్‌టీపీ అందుబాటులోకి వస్తే రెండు వేర్వేరుగా శుభ్రం చేసుకోవచ్చు. జనాభాను దృష్టిలో ఉంచుకొని కేఎల్‌డీ సామర్థ్యంతో ప్లాంట్లు నిర్మిస్తున్నారు.

**స్వచ్ఛత ర్యాంకులు**

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణాలుగా ఇప్పటికే ప్రకటించారు. ఓడీఎఫ్, ఓడీఎఫ్ం సర్టిఫికెట్ సాధించి శుభ్రతలో మెరుగైన స్థానం సాధిస్తున్నారు. కరీంనగర్ కార్పొరేషన్ మాత్రం వాటర్ం ర్యాంకుతో ముందు వరుసలో ఉంది. ఈ ఏడాది కూడా దీనికి మార్కులు సాధించారు. అన్ని పురపాలికల్లో వీటిని వినియోగంలోకి తీసుకొస్తే ఆయా విభాగాల్లో ర్యాంకులు సాధించే వీలుంది.

**గడువు ముగుస్తున్నా పట్టింపేదీ?**

రాష్ట్రవ్యాప్తంగా ప్యాకేజీల వారీగా టెండర్లు దక్కించుకున్న వేర్వేరు సంస్థలు ఆరు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. కోరుట్ల, మెట్‌పల్లి, రామగుండం, చొప్పదండి, కొత్తపల్లి(ప్రస్తుతం విలీనం) పురపాలికల్లో పనులు పూర్తి చేశారు. మిగతా చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని చోట్ల పనులే ప్రారంభించలేదు. పుర, నగరపాలక కమిషనర్లు సైతం ఆ వైపు ఆలోచన చేయడం లేదు.

# భూముల రీసర్వే.. ఇరవై గ్రామాల ఎంపిక



మెట్‌పల్లి: భూముల రీసర్వేపై దృష్టిపెట్టిన ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా అయిదు గ్రామాలను ఎంపిక చేసింది. అందులో జిల్లాలోని కోమన్‌పల్లి గ్రామం కూడా ఉంది. తాజాగా జిల్లాలోని 20 రెవెన్యూ గ్రామాలను రీసర్వే కోసం ఎంపిక చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పైలట్ గ్రామంలో చేపట్టిన అనుభవాలతో ముందుకు సాగనున్నారు.

**20 ఏళ్లకోసారి చేయాల్సి ఉన్నా..**

ఇరవై ఏళ్లకోసారి భూముల రీసర్వే జరగాల్సి ఉన్నా.. ఈ ప్రక్రియ ఎక్కడ అమలు కావటం లేదు. చాలా ఏళ్ల కిందటి సర్వే నంబర్లు, రికార్డులకు ఉప సంఖ్యలు చేర్చుతూ కొనసాగిస్తున్నారు. కొన్నిచోట్ల దస్త్రాల మేరకు భూములు పరిశీలిస్తే.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. అధికారులకు తలనొప్పిగా మారి.. రైతులకు సమస్యలు ఏర్పడుతున్నాయి. ఏళ్ల తరబడి ఇలాగే ఉండటంతో కబ్జాలు, గొడవలకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ భూములకు కచ్చితమైన హద్దులు నిర్ణయించి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. భూభారతి చట్టంలో సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేస్తూ నిబంధన తేగా.. భూధార్‌ను త్వరగా అమల్లోకి తీసుకరావాలని భావిస్తోంది. భూధార్ కార్డుల జారీకి ప్రతి భూమిని సర్వే చేయాల్సి ఉంటుంది. సరిహద్దులను అక్షాంశాలు, రేఖాంశాలతో గుర్తించాలి. దీంతో రీసర్వే చేపట్టి పక్కాగా భూరికార్డులను రూపొందించేందుకు కార్యాచరణ చేపట్టింది. ఇందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్లను ప్రభుత్వం నియమిస్తోంది.

**పక్కాగా నమోదు**

ఎంపిక చేసిన గ్రామాల్లో భూ కొలతలు, రికార్డుల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, పట్టా, అటవీ, దేవాదాయ, వక్ఫ్, గ్రామకంఠం, కాలువలు, రహదారులు, పైపులైన్లు తదితర భూముల రీసర్వే చేయనున్నారు. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాల్లో జనావాసాలు విస్తరించాయి. భౌగోళిక హద్దులు మారుతున్నాయి. రీసర్వేలో భూవిస్తీర్ణం పక్కాగా కొలుస్తారు. సంబంధించి సర్వే నంబర్లు, ఉప సంఖ్యలు, నేల రకం, విస్తీర్ణం, యజమాని వివరాలు, సరిహద్దులు, అక్షాంశాలు, రేఖాంశాలు తదితర వివరాలు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి నమోదు చేస్తారు. భూయజమానుల సమక్షంలోనే సర్వే ఉంటుంది.

**ఎంపికైనవి..**

రాయికల్ మండలంలోని దేవన్‌పల్లి, బీర్పూర్‌లోని నేదునూరు, అన్నారం, డొంకేశ్వరం, మోతీనగర్(గంగాసముందర్, నూతినగర్), మోతీనగర్(సిరిపురం), పచ్చునూర్, మెట్‌పల్లి మండలం మేడిపల్లి, బండలింగాపూర్.. ఇందిరానగర్, రత్నాపూర్, నడికుడ, సంగెం, శ్రీరాంపూర్(మల్లాపూర్), ఇబ్రహీంపట్నంలోని బర్తీపూర్, కోజన్‌కొత్తూర్, కేశాపూర్.. వెల్లటూరు మండలంలోని జగదేవ్‌పేట, ధర్మపురిలోని గాదెపల్లి, మగ్గిడి గ్రామాలు.

# కార్లలో కాదు.. కాలినడకన తిరగండి

హైదరాబాద్: నగరంలో మూసీ నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలను కలుపుతూ శతాబ్దాల కిందట నిర్మించిన పైవంతెనలే ఇప్పటికీ వినియోగంలో ఉన్నాయి. కొత్తవి నిర్మాణం కాలేదు. నగరాభివృద్ధికి వారధులైన మూసీ వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇటీవలి వరదలతో మరింత విధ్వంసం చోటు చేసుకుంది. ఏకంగా మూడు వంతెనలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరికొన్నింటి పునాదులపై ప్రభావం పడింది. ఇటీవలి వర్షాల నేపథ్యంలో నదిపై ఉన్న వంతెనల పరిస్థితిని పరిశీలించగా.. అనేక సమస్యలు వెలుగు చూశాయి. స్థానికులతో మాట్లాడగా.. అధికారులు కార్లలో కాకుండా.. కాలినడకన తిరగాలని, మూసీ నది పొడవునా తిరిగితే.. తీసుకోవాల్సిన చర్యల గురించి అర్థమవుతుందని పురానాపూల్ వద్దనున్న ధోబీఘాట్ నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

**పరిశీలనలో గుర్తించిన సమస్యలు..**

నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల మధ్య దూరం 200మీటర్ల నుంచి 300 మీటర్లు. మూసారాంబాగ్ వంతెనను మూసేయడంతో 5కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

మంచిరేవుల వంతెన కూలిపోవడంతో.. వాహనదారులు టిప్పుఖాన్ బ్రిడ్జి, సన్‌సిటీ, అప్పా కూడలి ప్రాంతాలను చుట్టేయాల్సి వస్తోంది. పది నుంచి 15 కిలోమీటర్ల దూరం తిరుగుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల వచ్చిన వరదల సమయంలో.. ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ద్విచక్ర వాహనదారులు 200మీటర్ల అవతల ఉన్న ప్రాంతానికి చేరుకోవాలంటే.. 15కి.మీ తిరగాల్సి వచ్చింది. ఎంజీబీఎస్, కోఠి, కాచిగూడ ప్రాంతాల నుంచి రోజూ లక్షలాది వాహనాలు చాదర్‌ఘాట్ వంతెన



మీదుగా మలక్‌పేట్ వైపు వెళ్తుంటాయి. ఇటీవలి వరదలతో ఆ వంతెన పూర్తిగా దెబ్బతింది. రెయిలింగ్ మొత్తం కొట్టుకుపోవడంతో.. అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేసి వాహనాలను పంపిస్తున్నారు. అయినప్పటికీ.. వంతెన సామర్థ్యంపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**అటకెక్కించిన సర్కారు..**

నగరంలో 55కి.మీ పొడవున మూసీ ప్రవహిస్తుంది. ఆ పరిధిలో రూ.545కోట్ల అంచనా వ్యయంతో 15 వంతెనలను నిర్మించేందుకు గత సర్కారు పనులు చేపట్టింది. పీర్జాదిగూడ, బండ్లగూడను కలుపుతూ ఉప్పల్ మండలం పరిధిలో రూ.40కోట్లతో తలపెట్టిన వంతెన నిర్మాణం దాదాపు 50శాతం పనులు పూర్తి చేసుకుంది. చింతల్‌మెట్ వద్ద భూ పరీక్షలు జరిగాయి. మూసారాంబాగ్, చాదర్‌ఘాట్ వద్ద శంకుస్థాపనలు జరిగాయి. అంతలోనే ప్రభుత్వం మారిపోయింది.

# దారులు అధ్వానం.. రాకపోకలకు నరకం

కోరుట్ల : చిత్రంలో కనిపిస్తోంది కోరుట్ల–వేములవాడ రహదారి. కథలాపూర్ మండలం సిరికొండ శివారులోని తారు లేచిపోయింది. రోడ్డు దెబ్బతిని అయిదేళ్లు గడుస్తున్నా కనీసం మరమ్మతులు చేయకుండా వదిలేశారు. ఈ మార్గంలో నిత్యం కోరుట్ల నుంచి హైదరాబాద్, వేములవాడ, సిరిసిల్ల, సిద్దిపేట, కథలాపూర్ తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, వాహనాల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వేల సంఖ్యలో ద్విచక్రవాహనాలు నడుస్తుంటాయి. దెబ్బతిన్న రహదారిపై వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతుండగా, ద్విచక్రవాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లాలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. తారు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా, తారు లేచిపోతున్నా నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోగా, కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. గుంతలు, గీతల రహదారులపై ఇబ్బందుల మధ్య నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు అవస్థల మధ్య రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలో రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్



శాఖల పరిధిలో మొత్తం 16 వేల కిలోమీటర్లకుపైగా రహదారులున్నాయి. గత ప్రభుత్వంతో పాటు సుమారు రెండేళ్ల కిందట ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రహదారుల మరమ్మతు, నిర్వహణపై పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదేళ్లుగా నిర్మాణాలకు నిధులు కేటాయించడం లేదు. కొన్నేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిన్నా మరమ్మతులు చేపట్టలేదు. కల్వర్టులు, రహదారులు కోతలకు గురవుతుండటంతో సంబంధిత అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. నిధులు మంజూరు కాక వాహనదారులకు నరకం తప్పడం లేదు.

కోరుట్ల మండలంలోని రహదారులపై ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు 20 వరకు 37 ప్రమాదాలు చోటుచేసుకోగా 16 మంది మృతి చెందారు. కోరుట్ల–అయిలాపూర్ రహదారి ఇది. ఈ మార్గంలో కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడంతో తారుపై పూర్తిగా గీతలు పడ్డాయి. రహదారి దెబ్బతిని సుమారు అయిదేళ్లవుతోంది. కోరుట్ల నుంచి మల్లాపూర్ వరకు గల ఈ రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలోనే నిర్మల్ జిల్లాకు, రాయికల్ మండలానికి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గీతల దారిపై ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

# మురుగు శుద్ధిపై నిర్లక్ష్యం

గోదావరిఖని : రామగుండం నగరంలోని మురుగు నీరు నేరుగా నదిలోకి చేరుతోంది. దీంతో పవిత్ర గోదావరి కాలుష్యకాసారంగా మారుతోంది. రామగుండం నగరపాలికలో 5 లక్షల జనాభా నివసిస్తుండగా 65 వేల నివాసాలున్నాయి. రోజుకు 65 మిలియన్ లీటర్ల మురుగు విడుదలవుతోంది. మురుగు శుద్ధి చేసేందుకు చేపట్టిన ఎస్టీపీల నిర్మాణాలు ఒక్కటి కూడా అందుబాటులోకి రాలేదు. నగరంలో చేపట్టిన ఎస్టీపీల నిర్మాణాలపై ప్రత్యేక కథనం.

కార్మిక వాడల్లోని మురుగు శుద్ధి లక్ష్యంతో సింగరేణి నిర్మించిన ఎస్టీపీ అందుబాటులోకి రాలేదు. రెండేళ్ల కిందట చేపట్టిన పనులు చివరి దశకు చేరాయి. రూ.17 కోట్లతో 17 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్టీపీని జీడీకే–2 గని సమీపంలో నిర్మించారు. తిలక్‌నగర్, విఠల్‌నగర్, ఫైవింక్లైన్‌కాలనీ, రమేశ్‌నగర్ ప్రాంతాల్లోని మురుగు వీటిలోకి చేరుతుంది. సుందిళ్ల, జనగామ గ్రామాల్లోని చెరువుల్లోకి కూడా శుద్ధి నీటిని పంపించాలని ప్రణాళికలు చేశారు.

రామగుండం నగరపాలికలో నాలుగు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు నిర్మించాల్సి ఉండగా ఇంకా పనులు ప్రారంభంకాలేదు. అమృత్ 2.0 కింద రూ.88 కోట్లు వెచ్చించి గోదావరిఖని సమీపంలోని మల్కాపూర్, జనగామ, రామగుండం, యైటింక్లైన్‌కాలనీల్లో నిర్మాణాలకు ప్రతిపాదించారు. టెండరు దక్కించుకున్న గుత్తేదారు కనీసం భూమి చదును కూడా చేయలేదు. మల్కాపూర్ శివారులో 21 ఎంఎల్‌డీ సామర్థ్యం, జనగామ, యైటింక్లైన్‌కాలనీల్లో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో



ప్లాంట్లు నిర్మించాల్సి ఉంది. రామగుండంలో ప్లాంటు నిర్మించినా ఇంకా అందుబాటులోకి రాలేదు.

డిజైన్ ఆమోదానికి ఎదురుచూపులు

ఎస్టీపీల డిజైన్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాం. టెండర్ ప్రక్రియ పూర్తయింది. డిజైన్ ఆమోదం రాగానే మల్కాపూర్, జనగామ, యైటింక్లైన్‌కాలనీల్లో ఎస్టీపీల నిర్మాణాలు మొదలు పెడతాం. పనులు మొదలైన తర్వాత ఏడాదిలో పూర్తి చేస్తాం. మనోజ్, ప్రజారోగ్య శాఖ ఏఈఈ

**నెల రోజుల్లో ప్రారంభం**

ఎస్టీపీ నిర్మాణం చివరి దశకు చేరుకొంది. నెలరోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రధాన పనులు పూర్తయ్యాయి. పూర్తి కాగానే త్వరలోనే ప్రారంభించి మురుగునీటిని శుద్ధి చేసి నదిలోకి విడుదల చేస్తాం. సుందిళ్ల, జనగామ చెరువుల్లోకి కూడా పంపిస్తాం. లలిత్‌కుమార్, ఆర్జీ–1 జీఎం

# పక్కాగా.. పంట లెక్క

రాజపేట: జిల్లాలో ప్రారంభమైన డిజిటల్ క్రాప్ సర్వేలో వ్యవసాయ విస్తరణ అధికారులు పూర్తిగా నిమగ్నమయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహిస్తున్న ఈ సర్వేలో ఎటువంటి అవకతవకలు, తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ డైరెక్టర్ సర్వే ప్రక్రియ నిత్యం సమీక్షిస్తున్నారు. గతేడాది సర్వే అరకొరగా నిర్వహించగా, ఈ ఏడాది వందశాతం పంటల నమోదు తప్పులు లేకుండా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయమై సర్వే కోసం వచ్చే ఏఈవోలకు రైతులు సహకరించి, విధిగా పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని యాదగిరిగుట్ట ఏడీఏ శాంతినిర్మలతో వెల్లడించారు.

**ప్రధాన ఉద్దేశం ఇదీ..**

దేశంలో ఏ పంటకు ఎంత దిగుబడి వస్తుందో తెలుసుకోవచ్చు. దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. మద్దతు ధర నిర్ణయిస్తారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కచ్చితత్వంతో నష్ట నిర్ధారణ, చీడపీడల ఉనికి, తగిన విధంగా రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలపై సంసిద్ధతకు అవకాశం ఉంటుంది. వ్యవసాయ పురోగతి అంచనాకు ఈ సర్వే దోహద పడుతుంది. అయితే క్రాప్ బుకింగ్ 90 శాతం పూర్తికాగానే రైతులకు సంక్షిప్త సమాచారం ద్వారా వివరాలు పంపిస్తారు. రైతు వివరాలు ప్రతి గ్రామ పంచాయతీలో ప్రదర్శించాలి. నమోదులో తప్పులు దొర్లితే సరిచేసేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ఏఈవో మూడు రోజుల్లో సరిచేసి తుది జాబితా ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది.

జిల్లా సమాచారం.. (ఎకరాల్లో)



సాగు యోగ్యమైన భూమి : 6.15 లక్షలు
ఆయా పంటలు సాగు చేపడుతుంది : 4.5 లక్షలు
రైతుల సంఖ్య : 2.28 లక్షలు
వానా కాలంలో సాగు అంచనా : 2,95,000
ప్రస్తుతం సాగు చేసింది : 68 శాతం

**సర్వే క్రమం ఇలా..**

ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ క్లస్టర్ పరిధిలోని రైతులను ప్రత్యక్షంగా కలిసి వాస్తవంగా సాగులో ఉన్న పంటల వివరాలు నమోదు చేయాలి. మహిళా ఏఈవోలు కనీసం 1800 ఎకరాలు, ఇతర ఏఈవోలు 2 వేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తారు. మిగిలిన వాటిని సాధారణ క్రాప్ బుకింగ్ పద్ధతిలో చేస్తారు.

ప్రతి పంటను ఫొటో తీసి మొబైల్ యాప్‌లో పంట పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయడం తప్పనిసరి.

సర్వేలో వరి రకాలను పేర్కొనడం తప్పనిసరి. ఇది ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఉపయోగపడుతుంది.

స్వల్ప కాలిక పంట రకాలైన మినుము, పెసర, మొక్కజొన్న వంటి వాటిని ముందుగా నమోదు చేయాలి.

పట్టాదారు పాసుపుస్తకం లేని, దేవాదాయ, ఇతర భూముల్లో సాగు చేసే పంటలను రైతు పేరు, ఆధార్, చరవాణి నెంబరు మొదలైన వివరాలతో నమోదు చేస్తారు.

# నీటి మీటర్లతో చుక్కలు

హైదరాబాద్ : నగరానికి తాగునీటిని సరఫరా చేసే జలమండలిలో వాటర్ మీటర్ల ప్రక్రియ ప్రహసనంగా మారింది. మీటర్లు పనిచేయకుంటే బిల్లులను రెట్టింపు, మూడు రెట్లు బాదేస్తున్నారు. 14.07 లక్షల కనెక్షన్లు ఉన్నా సగం కనెక్షన్ల మీటర్లు పని చేయడం లేదని సమాచారం. గ్రీన్‌బ్రిగేడ్ కాంట్రాక్టర్లు, విక్రయ సంస్థలు, రీడర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. బల్క్ కనెక్షన్లకు బిగించిన ఆటోమెటిక్ మీటర్లు పనిచేయక ప్రతినెలా సగటు అంచనాల మేరకు బిల్లింగ్ చేయాల్సి వస్తుంది. దీంతో జలమండలితోపాటు వినియోగదారులకూ నష్టం వాటిల్లుతోంది.

**ఫిర్యాదు చేసినా..**

మీటరు పనిచేయకపోతే మార్చుకోవడానికీ ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులను సంప్రదిస్తే మీటరు మార్పు బాధ్యత మీదేనని చెబుతున్నారు. ఒక వినియోగదారుడి ఇంట్లో జనవరి నుంచి మీటరు పనిచేయడం లేదు. మార్చాలని జలమండలి కార్యాలయం చుట్టూ తిరగడమే కాకుండా ఆన్‌లైన్‌లో 30 సార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ స్పందన లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**పరిష్కరించినట్లు సందేశాలు**

మీటరు పనిచేయడం లేదని ఆన్‌లైన్‌లో జలమండలికి ఉదయం ఫిర్యాదు చేస్తే సాయంత్రానికి సమస్య పరిష్కరించినట్లు వినియోగదారు చరవాణికి మెసేజ్‌లు మాత్రం వస్తున్నాయి. పరిష్కరించకుండానే ఇలా



సందేశాలు పంపడంతో వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. తాము ఉచిత నీటి పథకం పరిధిలో ఉన్నా పనిచేయని మీటర్ల కారణంగా బిల్లులు చెల్లించాల్సి వస్తోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఓ కొత్త కనెక్షన్ కథ ఇది**

అమీన్‌పూర్‌లో కొత్త నల్లా కనెక్షన్‌కు మీటరు కోసం జూన్‌లో జలమండలి రూ.37 వేలు వసూలు చేసింది. కనెక్షన్ ఇచ్చేటపుడు మీటరు ఏర్పాటుకు మరో రూ.8వేలు చెల్లించాలని గ్రీన్‌బ్రిగేడ్ కాంట్రాక్టర్ వసూలు చేశారు. నెలలోపే పాడైంది. ఏడాది గ్యారంటీ ఉన్నందున మార్చాలని ఒత్తిడి చేస్తే కొత్తది ఏర్పాటు చేశారు. అదీ మొరాయించింది. చివరకు కొత్త మీటరు బిగించుకోవాల్సి వచ్చిందని వినియోగదారు వాపోయారు.

# పర్యవేక్షణ లోపం.. పనులు నాసిరకం



జగిత్యాల : వినాయక నిమజ్జన వేడుకల కోసం జగిత్యాల పట్టణంలో చేసిన పనుల్లో నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోంది. శుక్ర, శనివారాల్లో నిమజ్జనానికి సన్నాహాలు చేస్తున్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో రహదారులకు ఏటా తాత్కాలిక మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఈసారి బల్దియా రూ.24 లక్షలు కేటాయించింది. రోడ్లపై మొరంతో గుంతలు పూడ్చేందుకు రూ.5 లక్షలు, చెరువు కట్టపై క్రేన్ల కోసం రూ.5 లక్షలు, విద్యుత్తు సౌకర్యం, విద్యుత్తు దీపాల కోసం రూ.10 లక్షలు, కట్టపై వసతుల కల్పనకు రూ.4 లక్షలు కేటాయించారు. టెండరు ద్వారా పనులను గుత్తేదార్లకు అప్పగించారు.

**మొరం కాదు.. మట్టి**

రహదారులపై గుంతలను మొరంతో పాటు, సిమెంటు దుమ్ముతో పూడ్చాల్సి ఉండగా మట్టి వేసి చదును చేస్తున్నారు. అసలే బురదతో ఉన్న రోడ్లపై ఎర్ర మట్టి పోయడంతో మరింత అధ్వానంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. ఆర్టీసీ డిపో, వైద్య కళాశాల, ఎల్‌జీ గార్డెన్, కొత్త బస్టాండు తదితర ప్రాంతాల్లో గుంతల సమస్య తీవ్రంగా ఉంది. ఈసారి చాలా వరకు పెద్ద పరిమాణంలోని వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేశారు. బురద రోడ్లపై తరలించడానికి నిర్వాహకులకు ఇబ్బందులు తప్పేలా లేవు. పనుల తీరుపై 'న్యూస్‌టుడే' ఏఈ చరణ్‌తేజను వివరణ కోరగా గుంతల్లో మొరం మాత్రమే వస్తున్నారని, మట్టి ఉంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించిన పనుల టెండర్లలో అధికారులు నిబంధనలు పాటించలేదు.

గుత్తేదార్లతో కుమ్మక్కై కొన్ని పనులను గుత్తేదార్లకు అనుకూలంగా మార్చారు.

విద్యుత్తు దీపాలు, క్రేన్ల ఏర్పాట్లలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన కొరవడటంతో గుత్తేదార్లు అరకొరగా పనులు చేపట్టారు.

గుత్తేదార్లు ప్రైవేటు వ్యక్తులలో చేపట్టాల్సిన పనులకు పురపాలక సిబ్బందిని వాడుకున్నారు.

# పట్టా పేర అనుమతి.. అటవీ భూమి చెరబట్టి



పెద్దపల్లి: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో మట్టి అవసరాలు పెరగడంతో అక్రమార్కులు అందినకాడికి దోచుకునేందుకు అక్రమ మైనింగ్‌కు తెరతీశారు. పట్టా భూమి పేరిట అనుమతులు పొంది అటవీ భూములను తవ్వేస్తున్నారు. రాత్రికి రాత్రే తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అటవీ శాఖ సిబ్బంది సహకారంతోనే ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగుతుందన్న ఆరోపణలున్నాయి. కొన్ని రోజులుగా సాగుతున్న మట్టి అక్రమ రవాణాపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ప్రేక్షకపాత్ర పోషించడంతో మట్టిదందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది.


**ఇటుక బట్టీలకు వరం..**

పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో పట్టా భూములలో మట్టి తవ్వకాలకు అనుమతులు పొందారు. కానీ తవ్వకాలు పట్టా భూములను వదిలేసి అటవీ భూముల వరకు సాగుతుంది. పట్టా భూములలో అనుమతించిన మైనింగ్ అధికారులు హద్దులు నిర్ణయించకపోవడంతో తవ్వకాలు గుట్టలవైపు వెళ్తున్నాయి. ఈ తవ్వకాలు ఇటుక బట్టీల నిర్వాహకులకు వరంగా మారుతున్నాయి. ఎగుడుదిగుడుగా ఉన్న గుట్టలను తవ్వడంతో నేల సమాంతరంగా మారుతుంది. ఈ స్థలాన్ని బట్టీల నిర్వాహకులు వినియోగించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. మట్టి తవ్వకాలకు అనుమతి పొందిన పట్టాదారులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు.

**అధికారి ఏమన్నారంటే..**

జిల్లాలో జరుగుతున్న తవ్వకాలపై జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస్‌ను సంప్రదించగా గౌరెడ్డిపేటలో పట్టా భూములలో 2.64 హెక్టార్లలో మాత్రమే అనుమతించామని, ముత్తారం మండలం పారుపల్లిలో ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్ చేస్తున్న యంత్రాలను సీజ్ చేసినట్లు చెప్పారు. **పెరిగిన అవసరాలతో..** గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మట్టి వినియోగం పెరగడంతో పలు గ్రామాల్లో అనధికారిక క్వారీలు ఏర్పడుతున్నాయి. గత నెలలో తుర్కలమద్దికుంటలో వెలుగులోకిరాగా.. తాజాగా జిల్లాలోని ప్రతి మూడు గ్రామాలకు ఒక క్వారీ చొప్పున పెరిగిపోయాయి. పెద్దపల్లి, పాలకుర్తి, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, ధర్మారం, జూలపల్లి మండలాల్లోని గుట్ట ప్రాంతాల్లోనే ఈ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

# ముంచిన వరద.. తెగుళ్ల బెడద



జగిత్యాల: జిల్లాలో ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న పైర్లను చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు. వరదలకు కొట్టుకుపోగా మిగిలిన పంటలకు చీడపీడలు, తెగుళ్ల బెడద పెరిగిందని వాపోతున్నారు. మొత్తం 7 మండలాల పరిధిలోని 35 గ్రామాల్లో 2,540 మంది రైతులకు చెందిన దాదాపు 2,963 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో 2,029 ఎకరాల్లో వరి, 222 ఎకరాల్లో పత్తి, 342 ఎకరాల్లో మొక్కజొన్న, 65 ఎకరాల్లో సోయాబీన్, 305 ఎకరాల్లో ఉద్యాన పంటలకు 33 శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. వాస్తవ నష్టం ఇంతకంటే ఎక్కువగా ఉంటుంది. తక్కువ దెబ్బతిన్న పంటల్లో వర్షాలతో చీడపీడలు వ్యాప్తి చెందాయి. పత్తిలో వడలు తెగులు వ్యాప్తి చెంది మొక్కలు నిలువునా ఎండిపోయాయి. వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సన్నగింజ రకాల్లో సుడి దోమలు వ్యాపిస్తున్నాయి. పసుపులో దుంపకుళ్లు, మర్రాకు తెగులు, ఇతర పంటల్లోనూ తెగుళ్ల తీవ్రత పెరిగినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

**అమలుకు నోచని బీమా పథకం**

తాము అధికారంలోకి వచ్చాక పూర్తి ప్రీమియం తామే చెల్లించి పంటల బీమా అమలు చేస్తామని గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. 2023 డిసెంబరులో ఆ పార్టీ అధికారం చేపట్టగా 2023-24 యాసంగి, 2024-25 వానాకాలం, యాసంగి సీజన్లు గడిచిపోయాయి. ప్రస్తుత 2025 వానాకాలం సీజన్‌కు పంటల సాగుకు అదను దాటినా ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమాను అమలు చేయడం లేదు. జిల్లాలో గతంలో వరి, పత్తి, మిరప, మామిడి, వేరుశనగ తదితర 8 రకాల పంటలకు పథకాన్ని అమలు చేశారు. వచ్చే యాసంగి సీజన్ నుంచైనా పునరుద్ధరిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

**పది సీజన్లుగా అందని పరిహారం**

2020 వానాకాలంలో అధిక వర్షాలతో జిల్లాలో 10,900 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. బాధిత రైతులకు 3 నెలల్లోపు పెట్టుబడి రాయితీ(పంట నష్ట పరిహారం), 4 నెలల్లోపు పంటల బీమా పరిహారం చెల్లించాలని 2021 సెప్టెంబరు 28న రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయినా ఒక్క రైతుకూ పరిహారం అందలేదు.

2021 వానాకాలంలో అధిక వర్షాలతో 30 వేల ఎకరాల్లో, 2021-2022 యాసంగిలో వడగండ్లతో 12 వేల ఎకరాల్లో పంటలను రైతులు నష్టపోయారు.

2022 వానాకాలంలో 22,993 ఎకరాల్లో ఆరుతడి పంటలు, 4,130 ఎకరాల్లో వరి పైర్లు దెబ్బతిన్నాయి. 2023 వానాకాలంలో భారీ వర్షానికి 15,487 ఎకరాల్లో అన్నిరకాల పంటలకు నష్టం వాటిల్లినా పరిహారం ఇవ్వలేదు. 2023 యాసంగిలో 26,199 ఎకరాల్లో పంటలు దెబ్బతింటే కేవలం 532 ఎకరాలకు మాత్రమే ఎకరానికి రూ.10 వేల చొప్పున అందజేశారు.

2024-25 వానాకాలం, యాసంగి సీజన్లలో దెబ్బతిన్న 12,943 ఎకరాల పంటలకు పరిహారం రాలేదు. ప్రస్తుతం దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇచ్చేలా రైతువారీగా సర్వే నిర్వహించాల్సి ఉంది.

# సాగుకు ఊతం.. ఉపాధితో లాభం

చేగుంట: గ్రామాల్లో వలసలను నివారించి స్థానికంగానే ఉపాధి కల్పించాలనే ఉద్దేశంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. కాలానుగుణంగా నూతన పనులను చేరుస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువలు, మొక్కల పెంపకం, చేపల చెరువులు వంటి వాటితో పాటు రెండేళ్లుగా ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటోంది. 100 శాతం రాయితీతో ఇచ్చే కింది పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

**పశువుల పాకలు:** యూనిట్ ధర రూ.98 వేలు. మూడు పశువులు కచ్చితంగా ఉన్న వారికే ప్రాధాన్యం. మేకలు లేదా గొర్రెల షెడ్లు: యూనిట్ ధర రూ.98 వేలు. 10 మేకలు లేదా గొర్రెలు ఉన్న వారే పథకానికి అర్హులు.

**పౌల్ట్రీ షెడ్లు:** ఒక యూనిట్ ధర(మండలానికి కేవలం ఐదు) రూ.25 వేలు. రైతు షెడ్డును నిర్మించుకొని 100 నాటు కోడిపిల్లలను పెంచాల్సి



ఉంటుంది. 1000 నాటు కోడిపిల్లలు పెంచేందుకు రూ.3 లక్షలు చెల్లిస్తారు.

**అజోల్లా పెంపకం:** యూనిట్ ధర రూ.20 వేలు. రైతులకు మాత్రమే అందజేస్తారు.

**వర్మీ కంపోస్టు గుంతలు:** యూనిట్ ధర రూ.15 వేలు. రైతులు సామూహికంగా లేదా వ్యక్తిగతంగా చేసుకోవచ్చు.

**ఇంకుడు గుంతలు:** ఒక్క యూనిట్‌కు రూ.6,500 చొప్పున ఇస్తారు.

నిబంధనల ప్రకారమే పనులు...

ఎస్టీ, ఎస్సీ రైతులకు సంబంధించి సాగులో లేని భూముల్లో అభివృద్ధి పనులు, వ్యక్తిగత పనులు అందుబాటులో ఉంటాయి. లబ్ధిదారులు ఉపాధి హామీ పథకంలో నిబంధనల ప్రకారం మంజూరైన పనులు చేయాల్సి ఉంటుంది. పలు యూనిట్లకు కూలీల ఖర్చు, సామగ్రి ఖర్చులు కలిపి అందిస్తారు. మండల స్థాయిలో ఏపీవో, ఈసీ, టీఏ లేదా గ్రామస్థాయిలో క్షేత్ర సహాయకుడు లేదా పంచాయతీ కార్యదర్శులకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

పంచాయతీలు: 493
ఉపాధి జాబ్ కార్డులు: 1,64,322
పనిచేస్తున్న జాబ్‌కార్డులు: 1,13,484
కూలీలు: 3,31,431
పనిచేసేవారు: 2,09,344

# స్వశక్తికి అక్షర వెలుగులు

మెట్‌పల్లి : గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపడంతో పాటు చదువు మధ్యలో ఆపేసిన వారికి విద్య అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టాయి. విద్యాశాఖ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ), తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియ ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాలోని స్వశక్తి సంఘాల్లో చదువు రాని, మధ్యలో ఆపేసిన సభ్యులను గుర్తించి ఇప్పటికే యాప్‌లో వివరాలు నమోదు చేశారు. వీరికి చదువు నేర్పి ఆర్థిక డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తారు.

**41,797 మంది గుర్తింపు**

జిల్లాలో 14 వేలకు పైగా స్వయం సహాయక సంఘాల్లో 1.79 లక్షల



మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీరిలో అక్షరాస్యత పెంపొందించడానికి నడుం బిగించారు.

ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో నిరక్షరాస్యులైన అతివలను గుర్తించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి జిల్లావ్యాప్తంగా 41,797 మందిని నిరక్షరాస్యులను గుర్తించారు.

వీరికి అక్షరాలు నేర్పడానికి పది మందికి ఒకరు చొప్పున సంఘాల్లోని ఔత్సాహిక మహిళలను వాలంటీర్లుగా ఎంపిక చేశారు.

జిల్లావ్యాప్తంగా 4,151 మంది వాలంటీర్లను గుర్తించి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. మండలాల వారీగా ఉపాధ్యాయులకు, వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. చదువు చెప్పేందుకు అవసరమైన పుస్తకాలు మండలాలకు చేరుకున్నాయి. గ్రామ స్థాయిలో వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. చదువు నేర్చుకున్న తర్వాత వచ్చే ధ్రువీకరణ పత్రంతో మహిళలు తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా పదో తరగతి, ఆపై చదువు పూర్తి చేసే అవకాశం కల్పించారు.

**మధ్యలో ఆపేసిన వారికి సార్వత్రిక విద్య**

ఆర్థిక వెనుకబాటు, కుటుంబ పరిస్థితులతో మధ్యలో చదువు ఆపేసిన మహిళలపైనా దృష్టి సారించారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా వీరికి అవసరమైన విద్య అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించి చదువుకొనేలా ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో పదో తరగతిలోపు 373 మంది, ఇంటర్మీడియట్‌లోపు 510 మంది మహిళలు చదువు ఆపేసినట్లు గుర్తించారు. వీరు పై చదువులు చదివేలా అవగాహన కల్పించారు. ఉన్నత విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రోత్సహిస్తూ ఇప్పటివరకు 291 మంది పదో తరగతి, 419 మంది ఇంటర్‌లో చేరేందుకు ప్రవేశ రుసుం చెల్లించారు. స్వశక్తి సంఘాల సభ్యుల్లో పూర్తి స్థాయిలో అక్షరాస్యులైన సభ్యులే ఉండేలా చూస్తూ వారికి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెంచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



# కర్నూలు బస్సు ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని, తెలుగు రాష్ట్రాల సీఎంలు దిగ్భ్రాంతి..!

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రాష్ట్రం మొత్తాన్ని విచారంలో నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద జాతీయ రహదారి 44పై అగ్నిప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు.

మిగిలిన వారిలో 12 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితులను కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, తెలుగు రాష్ట్రాల సీఎంలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రముఖుల సంతాపం.. కాగా బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్రపతి ముర్ము విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కూడా ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలన్నారు. అలానే ఏపీ లోని కర్నూలులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. ఈ విపత్కర సమయంలో తన ఆలోచనంతా బాధిత కుటుంబాల గురించేనని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని సంతాపం తెలిపారు. పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు చొప్పున.. క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున పరిహారం ప్రకటించారు.




# కర్నూలు దుర్ఘటన.. నిర్లక్ష్యమే కారణమని తేలితే కఠిన చర్యలు

అమరావతి: కర్నూలు బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో.. ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, అధికారులతో సమగ్ర విచారణకు ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు.

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల వివరాలు గుర్తించి కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో బస్సుల సాంకేతిక తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదికను కోరారు.

# భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి: పవన్ కళ్యాణ్



అమరావతి: కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తీవ్రంగా కలచివేసిందని చెప్పారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో శుక్రవారం వేకువజామున మంటలు చెలరేగాయి. బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో అగ్నిప్రమాదం జరిగి 19 మంది సజీవ దహనమయ్యారు




# ప్రకాశం జిల్లాలో భారీ వర్షం రహదారులు జలమయం

ప్రకాశం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో పలు వాగులు పొంగుతున్నాయి. రహదారులపైకి భారీగా వరద చేరి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నాగులప్పలపాడు, ఒంగోలు, టంగుటూరు, సింగరాయకొండ, కొత్తపట్నం మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఒంగోలు పట్టణంలో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉప్పువాగు, సగిలేరు, కొత్తకోట, కానాల వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

# బాలయ్య పేరు ఎత్తే అర్హత నీకుందా?.. జగన్‌పై నుడా చైర్మన్ ఫైర్



నెల్లూరు, అక్టోబర్ 24: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుంది జగన్ తీరు ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. తాగి అసెంబ్లీకి వచ్చారని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను విమర్శలు చేశాడు సైకో జగన్ అంటూ మండిపడ్డారు. దీన్ని బట్టి జగన్ మానసిక పరిస్థితి బాగోలేదని అర్థం అవుతోందన్నారు. బాలకృష్ణ అభిమానిని అని గతంలో చెప్పిన జగన్.. ఇప్పుడు రాజకీయాల్లో నిలబడలేక ఇటువంటి అబద్ధపు విమర్శలు చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. చంద్రబాబును ఎదుర్కోలేక, అభివృద్ధి పనులు చూసి ఓర్చుకోలేక.. బాలకృష్ణను తాగుబోతు అని విమర్శలు చేశారని మండిపడ్డారు. బ్రాండ్ ఇమేజ్ ఉన్న నాయకుడు బాలయ్య అని.. బాలకృష్ణ పేరు ఎత్తే అర్హత జగన్‌కు లేదన్నారు. అవినీతి మచ్చలేని నాయకుడు బాలకృష్ణ అని పేర్కొన్నారు. వేలాది మంది పేద ప్రజలకు జగన్ బ్రాండ్ మందు తాగించారని ఆరోపించారు. పేదల కుటుంబాల్లో చీకట్లు నింపారని... ఆ డబ్బు ఏమి చేసుకుంటారంటూ జగన్‌ను ప్రశ్నించారు. అమెరికా తరువాత భారత దేశానికి వచ్చిన గూగుల్ సంస్థను కూడా విమర్శిస్తున్నారంటూ మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఒక్క కంపెనీ కూడా తీసుకురాలేదన్నారు. సైకోలా జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు కలిసి రాష్ట్రంలో అధికారం చెలాయించారని విమర్శించారు. దాచుకోవడం, దోచుకోవడం, తినుకోవడమే జగన్ పాలన తీరన్నారు. జగన్ మానసిక తీరు బాగోలేదని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వ్యాఖ్యలు చేశారు.



# కర్నూలు బస్సు ప్రమాదం.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

కర్నూలు: కర్నూలు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం అనేక కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గొల్లవారిపల్లిలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. గొల్ల రమేశ్ సహా నలుగురు కుటుంబ సభ్యులు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ ప్రమాదంలో గొల్ల రమేశ్ (35), ఆయన భార్య అనూష (30), కుమార్తె మన్విత (10), కుమారుడు మనీశ్ (12) మృతి చెందారు. బంధువులు ఘటనా స్థలికి చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది.


బస్సు బైక్‌ను ఢీకొట్టిన తర్వాత ద్విచక్రవాహనం బస్సు కిందకు దూసుకెళ్లడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో పలువురు సజీవదహనమయ్యారు.




# కర్నూలు దుర్ఘటన.. 16 బృందాలతో దర్యాప్తు


కర్నూలు: కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఏపీ హోం మంత్రి అనిత వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. మృతుల్లో ఏపీ, తెలంగాణ నుంచి ఆరుగురు చొప్పున, ఒడిశా, బిహార్ నుంచి ఒక్కొక్కరు, తమిళనాడు, కర్ణాటక నుంచి ఇద్దరు చొప్పున ఉన్నారు. మరొకరి మృతదేహం గుర్తించాల్సి ఉంది. కర్నూలు వ్యాస్ ఆడిటోరియంలో మంత్రులు అనిత, రాం ప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. బస్సులో 39 మంది పెద్దవాళ్లు, నలుగురు చిన్నారులతోపాటు గుర్తు తెలియని మరో వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. ప్రమాదం నుంచి ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది బయటపడ్డారు. స్వల్ప గాయాలతో ఆస్పత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హోం మంత్రి వెల్లడించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కాలిపోయాయన్నారు. చనిపోయిన వ్యక్తుల డీఎన్ఏ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేస్తామన్నారు. ఈ ప్రమాదంపై 16 బృందాలతో అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డీఎన్ఏ పరీక్షల కోసం 10 ప్రత్యేక బృందాలు పని చేస్తాయన్నారు. ప్రమాదానికి కారణాలు అన్వేషించేందుకు మరో 4 బృందాలు, రసాయన విశ్లేషణ కోసం 2 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బస్సు డ్రైవర్లిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. రోడ్డుపై పడి ఉన్న బైకును ఢీ కొట్టినట్లు బస్సు డ్రైవర్ చెప్పాడని, అంతకుముందే రోడ్డు ప్రమాదంలో బైక్ పడిపోయి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. "బైకు పైనుంచి బస్సు వెళ్లడంతో మంటలు చెలరేగాయని డ్రైవర్ చెప్పాడు. ప్రమాదానికి గల కారణాలపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోంది" అని ఎస్పీ వివరించారు.

# భారత్‌లో పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్: మంత్రి లోకేశ్



ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి గ్లోబల్ ఎకనామిక్ పవర్ హౌస్‌గా మార్చి, సాంకేతిక ఆవిష్కరణలు, సుస్థిరమైన సమగ్రాభివృద్ధి ద్వారా ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే తమ సంకల్పమని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో చివరి రోజు మంత్రి నారా లోకేశ్ బిజీబిజీగా గడిపారు. ఆస్ట్రేలియా ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులతో మెల్ బోర్న్‌లో నిర్వహించిన సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల నిరంతర శ్రమ దాగి ఉందని తెలిపారు. భారతదేశంలో పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను పరిగణించాలని కోరారు. ఏపీలో అనుభవం కలిగిన దార్శనిక నాయకత్వం ఉందన్నారు. రాష్ట్రంలో తాము చేపట్టిన పనులు పూర్తిచేయాలనే దృఢసంకల్పంతో ఉన్నామని, ఆయా ప్రాజెక్ట్‌లకు సంబంధించిన అధికారులు, నాయకులతో నిరంతరం ప్రాజెక్ట్ పురోగతిపై రోజువారీ పద్ధతిలో చర్చిస్తామని వెల్లడించారు. తమది జాతీయ దృక్పథం కలిగి ఉన్న పార్టీ అని, దేశ అభివృద్ధికి తోడ్పడే విధంగా తాము ఎప్పుడూ జాతీయ విధానాలపై సానుకూల ప్రభావం చూపామని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కలిసి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో చేయాల్సిన విధానపరమైన మార్పులు గుర్తించి, వాటిని అమలుచేసే పనిలో ఉన్నామన్నారు.

# మేయర్ దంపతుల హత్య కేసులో విచారణ పూర్తి.. కోర్టు సంచలన నిర్ణయం



చిత్తూరు, అక్టోబర్ 24: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిత్తూరు నగర మేయర్ దంపతుల హత్య కేసులో ఐదుగురు ప్రధాన ముద్దాయిలపై నేరం రుజువు అయిందని ప్రత్యేక మహిళా కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన విచారణను ప్రత్యేక మహిళా కోర్టు శుక్రవారం పూర్తి చేసింది. ఈ కేసులో దోషులకు అక్టోబర్ 27వ తేదీన శిక్షలు ఖరారు చేస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకోవాలని చిత్తూరు వన్ టౌన్ పోలీసులను ప్రత్యేక మహిళా కోర్టు ఆదేశించింది.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?...** 2015, నవంబర్ 15వ తేదీన చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ అనురాధపై కొంత మంది విచక్షణారహితంగా కాల్పులు జరిపారు.

ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఈ కాల్పు శబ్దం విని కార్యాలయంలోకి ఆమె భర్త, మున్సిపల్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు కఠారి మోహన్ .. మేయర్ ఛాంబర్‌లోకి వచ్చారు. ఇంతలో దుండగులు ఆయనపై ఆయుధాలతో దాడి చేశారు. ఆయన పరిగెత్తారు. ఆ క్రమంలో దుండగులు కత్తులతో ఆయనపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో మోహన్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ని తమిళనాడులోని వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించారు. దీంతో మేయర్ అనురాధ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆ క్రమంలో మేయర్ అనురాధ భర్త మోహన్ మేనల్లుడు చింటూ ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడని తేల్చారు. అతడితోపాటు మరో 23 మంది నిందితులుగా పోలీసులు పేర్కొన్నారు. ఈ పదేళ్లలో ఈ హత్య కేసులో దాదాపు 122 మంది సాక్షులను విచారించి.. నిందితులను కోర్టు గుర్తించింది. మరోవైపు ఈ కేసులో తుది తీర్పు శుక్రవారం వెలువడనున్న నేపథ్యంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు నగరంతోపాటు కోర్టు పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

## లక్కీ ఛాన్స్ కొట్టేసిన సైయారా బ్యూటీ.. ఆ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం

ఒక్కొక్కసారి అదృష్టం ఎలా ఉంటుంది అంటే అనూహ్యంగా ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీలు అయిపోతూ ఉంటారు. ఆ తర్వాత వారికి వరుసగా అవకాశాలు కూడా తలుపుతడతాయి. అలా ఇప్పటికే ఇండస్ట్రీలోకి వచ్చిన మొదటి సినిమాతోనే భారీ విజయాలను సొంతం చేసుకుని.. వరుస సినిమాలలో అవకాశాలు అందుకున్న హీరోయిన్స్ జాబితాలోకి 'సైయారా' బ్యూటీ కూడా వచ్చి చేరింది. బాలీవుడ్ లో ఈ ఏడాది చిన్న సినిమాగా వచ్చి సంచలనం సృష్టించింది ఈ సినిమా. ఇందులో నటించింది కొత్త నటీనటులు.. అయినా సరే ఏకంగా రూ.600 కోట్ల క్లబ్లో చేరిపోయి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా ఈ సినిమా ఇంత పెద్ద హిట్ అవ్వడానికి కథ కథనంతో పాటు లీడ్ రోల్స్ చేసిన అద్భుతమైన పర్ఫామెన్స్ ముఖ్య కారణం అని చెప్పవచ్చు. ప్రముఖ హీరోయిన్ అనన్య పాండే సోదరుడు అహాన్ పాండే, అనీత్ పడ్డా.. ఇద్దరికీ ఈ సినిమా తొలి సినిమానే అయినా ఏదో నటనలో పూర్తి అనుభవం ఉన్న నటీనటుల్లా నటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. యువత ఈ చిత్రానికి ఎంతలా కనెక్ట్ అయ్యింది అంటే సినిమా పూర్తి అయిన తర్వాత థియేటర్లలోనే ఏడ్చేసిన ఘటనలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. అంతేకాదు సినీ ఇండస్ట్రీలో ఒక యూత్ ఫుల్ రొమాంటిక్ చిత్రానికి యువత కనెక్ట్ అయ్యి ఏడ్చిన ఏకైక చిత్రం ఈ




సైయారా అని చెప్పవచ్చు. ఈ సినిమాతో ఇద్దరికీ అభిమానులు తమ గుండెల్లో గుడి కట్టేశారు అనడంలో సందేహం లేదు. అటు అహాన్ పాండే కూడా ఒక భారీ ప్రాజెక్టులో అవకాశం దక్కించుకోగా.. ఇప్పుడు అనీత్ పడ్డా కూడా ఆ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం కాబోతోందని మేకర్స్ స్వయంగా ప్రకటించడంతో అనీత్ పడ్డా అభిమానుల ఆనందానికి అవధులు లేవని చెప్పవచ్చు. అసలు విషయంలోకి వెళ్తే.. అందం , అభినయంతో అందరినీ ఆకట్టుకున్న అనీత్ పడ్డాతో సైయారా విడుదలకు ముందే యశ్ రాజ్ ఫిలిమ్స్ వాళ్ళు ఇంకో మూడు చిత్రాలకు ఆమెతో అగ్రిమెంట్ చేయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా వేరే ప్రొడక్షన్ హౌస్ ల నుంచి కూడా ఈమెకు అవకాశాలు వెల్లువెత్తుతు న్నాయి. ఇటు మరోవైపు ప్రస్తుతం బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యానర్లలో ఒకటైన మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ కూడా ఈమెతో ఒక క్రేజీ మూవీ చేయడానికి ప్లాన్ చేసింది. ఇక అందులో భాగంగానే తాజాగా మ్యాడ్ డాక్ హారర్ కామెడీ యూనివర్స్ లో భాగంగా ఈరోజు భారీ ఎత్తున విడుదలైన చిత్రం థామా. ఈ సినిమా చివర్లో ఈ ఫ్రాంచైజీలో కొత్త సినిమా విశేషాలను పంచుకుంది మ్యాడ్ డాక్ ఫిలిం సంస్థ. 'శక్తి షాలిని' పేరుతో తెరకెక్కుతున్న ఆ చిత్రంలో అనీత్ పడ్డా లీడ్ రోల్ చేయనుంది అంటూ తెలిపింది. అయితే థామా హిందీ వెర్షన్ లో ఈ సినిమా గురించి అనౌన్స్మెంట్ ఇవ్వడంతో అభిమానులు చాలా క్రేజీగా ఫీల్ అవుతున్నారు. రొమాంటిక్ చిత్రం సైయారాతో అందరి దృష్టిని ఆకట్టుకున్న అనీత్ పడ్డా ఇప్పుడు ఈ సినిమాలో హారర్ పాత్రలో కనిపించబోతుందని తెలిసి ఎక్సైట్మెంట్ కనబరుస్తున్నారు.

## శెట్టిబ్యూటీకి సక్సెస్ కలిసొచ్చిన వేళ!

కేజీఎఫ్ తో పాన్ ఇండియా సక్సెస్ అందుకున్నా కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టికి పెద్దగా అవకాశాలు రాని మాట వాస్తవం. కేజీఎఫ్ మొదటి భాగం రిలీజ్ అనంతరం మళ్లీ నాలుగేళ్ల గ్యాప్ అనంతరం కేజీఎఫ్ 2, కోబ్రాలో నటించింది. ఆ తర్వాత మళ్లీ మరో అవకాశం రావడానికి ఏకంగా మూడేళ్లు సమయం పట్టింది. అదీ కన్నడలో కాదు. ఆ అవకాశం కూడా తెలుగులో వచ్చింది. అదే రీసెంట్ రిలీజ్ హిట్ 3. నాని హీరోగా నటించిన సినిమాలో శ్రీనిధి శెట్టి సరైన పాత్ర పోషించి బాగానే ఫేమస్ అయింది. సినిమా విజయం అమ్మడికి కలిసొచ్చింది. గ్లామర్ కు తావు లేకుండా డీసెంట్ రోల్ పోషించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తాను అందాలు ఎరగా వేసి నటించే దాన్ని కాదు.. పెర్ఫార్మర్ మాత్రమేనని ప్రూవ్ చేసింది.

**టాలీవుడ్ లో మంచి భవిష్యత్:** తనలో ఆ ట్యాలెంట్ నేడు కొత్త అవకాశాలకు దారి తీసింది. ఇటీవలే రిలీజ్ అయిన తెలుసు కదాలో కూడా నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా రిలీజ్ కు ముందే వెంకటేష్-త్రివిక్రమ్ సినిమాలో ఛాన్సు అందుకుందనే ప్రచారం జరిగింది. మొన్నటి వరకూ అది ప్రచారమే అయినా నేడు అదే నిజమైంది. సినిమాలో వెంకీకి జోడీగా శ్రీనిధి ఫైనల్ అయింది. ఈ



నేపథ్యంలో శ్రీనిధి శెట్టికి ఇంకా మంచి భవిష్యత్ ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిభతో పాటు గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండటం వంటి కొన్ని లక్షణాలు మిగతా బ్యూటీల నుంచి వేరు చేస్తున్నాయి. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు మాత్రం ఎంచుకుంటూ ముందుకు సాగుతుంది.

**గ్లామర్ పాత్రలకు దూరంగా:** గ్లామర్ గేట్లు ఎత్తేస్తానంటే? అవకాశాలివ్వడానికి చాలా మంది సిద్దంగా ఉంటారు. కానీ ఆ ఛాన్స్ ఇవ్వకుండా శ్రీనిధి వచ్చిన అవకాశాలతో సంతృప్తి చెందుతుంది. అందులో ది బెస్ట్ సెలక్ట్ చేసుకుంటుంది. అమ్మడు డిజైనర్ దుస్తులకు కూడా దూరంగా ఉంటుంది. సింపుల్ డిజైన్స్ లో ముస్తాబవుతుంది. అందాల ఆరబోతకు ఎంత మాత్రం ఛాన్స్ ఇవ్వదు. సినిమా ప్రచార కార్యక్రమాల్లోనూ పద్దతైన దుస్తులు ధరించి కనిపిస్తుంది. అవన్నీ శ్రీనిధికి తెలుగులో ఓ రకంగా కలిసొచ్చేవే అయినా? మరో రకంగా కొన్ని రకాల ఛాన్సులు కోల్పోయే అవకాశం లేకపోలేదు. ఈ బ్యూటీ తీరు చూస్తుంటే?

**ఆ బ్యూటీ జర్నీలా శ్రీనిధి:** సాయి పల్లవి విధానంలో కనిపిస్తోంది. సాయి పల్లవి ప్రయాణం ఎలా సాగిందన్నది చెప్పాల్సిన పనిలేదు. కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ కేవలం నటనకు ఆస్కారం ఉన్న సినిమాలు మాత్రమే చేసు కుంటూ వచ్చింది. మధ్యలో పారితోషికం ఆఫర్లు ఎన్ని వచ్చినా? నో ఛాన్స్ అంటూ గీసుకున్న గీత దాట లేదు. తక్కువ పారితోషికం అయినా? నచ్చిన పాత్రలే చేస్తానంటూ ముందుకు సాగుతుంది. తనలో ఆ క్వాలిటీనే బాలీవుడ్ లో రామాయణం వరకూ దారి తీసింది. రామాయణంలో అమ్మడు సీత పాత్ర పోషిస్తోన్న సంగతి తెలిసిందే. శ్రీనిధి శెట్టి ప్రయాణం కూడా అలాగే సాగుతుందా? అన్నది చూడాలి.




## పెద్ది వర్సెస్ ప్యారడైజ్.. ఎవరు తగ్గట్లేదంతే..!





సంక్రాంతి, దసరా మాత్రమే కాదు సమ్మర్ కి ముందు అంటే మార్చి ఎండింగ్ కూడా సినిమాలకు కలిసి వచ్చే సీజన్ లా భావిస్తున్నారు మేకర్స్. ఎందుకంటే మార్చిలో కొంతమంది స్టూడెంట్స్ కి ఎలాగు ఎగ్జామ్స్ పూర్తవుతాయి. ఆ తర్వాత ఏప్రిల్ లో ఎలాగు సమ్మర్ హాలీడేస్ ఇస్తారు. అందుకే ఆ సీజన్ లో సినిమాలు రిలీజ్ అయితే మంచి సక్సెస్ అయ్యే ఛాన్స్ లు ఉంటాయని దర్శక నిర్మాతలు అలా ఫిక్స్ అయ్యారు. ఐతే ఈసారి అదే నెక్స్ట్ ఇయర్ 2026 మార్చి ఎండింగ్ కి రెండు సినిమాలు ఫైట్ జరగబోతున్నాయి. అందులో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పెద్ది ఒకటి రేసులో వస్తుండగా న్యాచురల్ స్టార్ నాని ది ప్యారడైజ్ కూడా వస్తుంది.

**రెండు సినిమాలు రెండు డిఫరెంట్ జోనర్..** మార్చి 26న నాని ది ప్యారడైజ్ వస్తుంటే.. ఒకరోజు తర్వాత మార్చి 27న పెద్ది రిలీజ్ డేట్ ఫిక్స్ చేశారు. ఐతే ఆరోజు చరణ్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ అనుకున్నారు. ఐతే మళ్లీ రిలీజ్ డేట్ ఒకరోజు ముందు అంటే మార్చి 26నే ఫిక్స్ చేస్తున్నారని టాక్. ఐతే ఈ రెండు సినిమాలు రెండు డిఫరెంట్ జోనర్ సినిమాలుగా వస్తున్నాయి. నాని శ్రీకాంత్ ఓదెల కంప్లీట్ గా వాళ్ల సేఫ్ జోన్ వదిలి భారీ ప్రయోగాన్నే చేస్తున్నారు. ది ప్యారడైజ్ లో జడల్ రోల్ లో నాని కనిపించబోతున్నాడు. ఈ రోల్ తో నాని మరోసారి తన సత్తా చాటుతాడని అంటున్నారు. ఐతే ఈ సినిమా కాన్సెప్ట్ ఇంకా స్క్రీన్ ప్లే అంతా కూడా నాని సత్తానికి చాటుతాయని అంటున్నారు. పెద్ది విషయంలో బుచ్చి బాబు చరణ్ కూడా అంతే కాన్ ఫిడెంట్ గా ఉన్నారు. సినిమాలో చరణ్ లుక్ ఇంకా స్టోరీ అంతా కూడా వేరే లెవెల్ లో ఉంటాయట. తప్పకుండా మెగా ఫ్యాన్స్ కి ఒక రేంజ్ లో మాస్ ఫీస్ట్ ఇచ్చేలా పెద్ది వస్తుంది.

**పెద్ది సినిమాలో శివ రాజ్ కుమార్.. ప్యారడైజ్ లో మోహన్ బాబు..** పెద్ది సినిమాలో శివ రాజ్ కుమార్ స్పెషల్ ఎట్రాక్షన్ కానున్నారు. అలానే నాని ది ప్యారడైజ్ లో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ గా నటిస్తున్నారు. పెద్ది, ది ప్యారడైజ్ ప్రస్తుతం రేసులో రెండు సినిమాలు ఉన్నాయి. ఈ సినిమాల ఫైట్ మాత్రం ఇంట్రెస్టింగ్ గా ఉండబోతుంది. రెండు సినిమాలు ఎక్కడ ఏమాత్రం తగ్గకుండా తెరకెక్కిస్తున్నారు. చరణ్ తో నాని పోటీ అనేదాని కన్నా రెండు సినిమాలు తెలుగు ఆడియన్స్ కు మరో సరికొత్త సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు.

ఇక్కడ మరో విశేషం ఏంటంటే ది ప్యారడైజ్ డైరెక్టర్ శ్రీకాంత్ కూడా తొలి సినిమా దసరాతో బ్లాక్ బస్టర్ కొట్టాడు.. బుచ్చి బాబు కూడా ఉప్పెనతో సెన్సేషనల్ హిట్ కొట్టి రెండో సినిమా పెద్ది చేస్తున్నాడు. డైరెక్టర్స్ కూడా తమ రెండో సినిమా ది బెస్ట్ అనిపించుకునేలా చేయాలని ఎఫర్ట్స్ పెడుతున్నారు.

## కాంతార ప్రీక్వెల్.. క్రేజీ లిస్ట్ లో ఏ ప్లేస్ సాధించిందంటే?



మూడేళ్ల క్రితం వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన కాంతార మూవీకి ప్రీక్వెల్ గా ఇప్పుడు కాంతార చాప్టర్ 1 తెరకెక్కిన విషయం తెలిసిందే. కన్నడ స్టార్ యాక్టర్ రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమాను హొంబలే ఫిల్మ్స్ బ్యానర్ పై విజయ్ కిరగందూర్ భారీ స్థాయిలో నిర్మించారు. దసరా కానుకగా అక్టోబర్ 2వ తేదీన రిలీజ్ చేశారు. మంచి అంచనాల మధ్య రిలీజ్ అయిన కాంతార ప్రీక్వెల్.. వాటిని అందుకుని దూసుకుపోతోంది.

ప్రీమియర్స్ షో నుంచి పాజిటివ్ టాక్ రాగా.. ఫస్ట్ రోజు నుంచి కూడా భారీ వసూళ్లను రాబడుతోంది. రిలీజ్ అయ్యి మూడు వారాలు అవుతున్నా.. సాలిడ్ కలెక్షన్స్ సాధిస్తోంది. ఇప్పటి వరకు రూ.750 కోట్లకుపైగా వసూలు చేసింది కాంతార చాప్టర్ 1. తద్వారా ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్లు పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన ఇండియన్ మూవీస్ (అన్ని భాషలు) జాబితాలో స్థానం సంపాదించుకుంది. ఆ క్రేజీ లిస్ట్ లో 15వ స్థానం సంపాదించుకుంది. రీసెంట్ గా వచ్చి సూపర్ హిట్ గా నిలిచిన చావా మూవీ తర్వాత స్థానంలో ఉంది. మరి ఆ జాబితాలో ఏ సినిమాలు ఉన్నాయంటే? 1. పీకే (2014) 2. భజరంగీ భాయిజాన్ (2015) 3. దంగల్ (2016) 4. బాహుబలి-2 (2017) 5. సీక్రెట్ సూపర్ స్టార్ (2017) 6. ఆర్ఆర్ఆర్ (2022) 7. కేజీఎఫ్ (2022) 8. పఠాన్ (2023) 9. జవాన్ (2023) 10. యానిమల్ (2023) 11. కల్కి 2898 ఏడీ (2024)12. స్త్రీ 2 (2024) 13. పుష్ప 2(2024) 14. చావా (2025) 15. కాంతార చాప్టర్ (2025) ఇక కాంతార చాప్టర్ విషయానికొస్తే.. ఇప్పుడు రూ.800 కోట్ల మార్క్ ను టచ్ చేసే దిశగా వెళుతోంది. అయితే భారతీయ భాషల్లో మంచి రెస్పాన్స్ తో పాటు వసూళ్లు అందుకుంటున్న సినిమా ఇంగ్లీష్ వెర్షన్ ను మేకర్స్ మరికొద్ది రోజుల్లో రిలీజ్ చేయనున్నారు. అక్టోబర్ 31వ తేదీన విడుదల చేస్తున్నారు. తద్వారా ఇంగ్లీష్ లో డబ్ అయిన తొలి ఇండియన్ మూవీగా కాంతార ప్రీక్వెల్ నిలిచింది. సినిమాలో రిషబ్ శెట్టి సరసన రుక్మిణీ వసంత్ నటించారు. గుల్షన్ దేవయ్య, ప్రమోద్ శెట్టి, రాకేష్ పూజారి, ప్రకాష్ తమినాడు, జయరామ్, దీపక్ రామ్ పనాజీ, హరిప్రసాద్ సహా పలువురు నటీనటులు ఇతర పాత్రలు పోషించారు. అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందించగా.. అరవింద్ కశ్యప్ సినిమాటోగ్రాఫర్ గా వర్క్ చేశారు. సురేష్ మల్లయ్య ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు.

## సీతమ్మ ఇలా స్లో అయితే ఎలా?

బాలీవుడ్ నటి అలియాభట్ సినిమాలు చేయడంలో స్పీడ్ తగ్గించిందా? పెళ్లికి ముందులా పెళ్లి తర్వాత పని చేయడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. 2012 లో అమ్మడు స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ తో కెరీర్ మొదలు పెట్టింది. అప్పటి నుంచి 2022 వరకూ ఒకే వేగంతో సినిమాలు చేసింది. ఆ వేగానికి తగ్గట్టే సక్సస్లు పడ్డాయి. 20-25 సినిమాల వరకూ ఒకే జోరుతో పని చేసింది. కానీ వివాహం అనంతరం అమ్మడు వేగం పూర్తిగా తగ్గించేసింది. 2022-25 మధ్య చూసుకుంటే కేవలం మూడు నాలుగు సినిమాలు మాత్రమే కనిపిస్తున్నాయి. 2022 లో ఒకే ఏడాది నాలుగు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలో ఉంది. అదే ఏడాది అమ్మడికి రణబీర్ కపూర్ తో వివాహమైంది. అప్పటి నుంచి ఏడాదికి ఒక సినిమా మాత్రమే రిలీజ్ లో ఉండేలా ప్లాన్ చేసుకుని ముందుకు సాగుతుంది. 2023 లో రాకీ ఔర్ రానీకి ప్రేమ్ కహానీ, హాలీవుడ్ చిత్రం హార్ట్ ఆఫ్ స్టోన్ తో ప్రేక్షకుల్లో ఉంది. అటుపై 2024 లో జిగ్రా తో అలరించింది. 2025



లో మాత్రం ఆల్ఫాతో అలరించడానికి రెడీ అవుతుంది. మరి అలియాలో వేగం తగ్గడానికి అసలు కారణం ఏంటి? అంటే సినిమాలు- ప్యామిలీ లైఫ్ ని బ్యాలెన్స్ చేసే క్రమంలోనే కొత్త ప్రాజెక్ట్ లు కమిట్ అవ్వడంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. అవకాశాలు క్యూలో ఉన్నా అలియా మాత్రం సెలక్టివ్ గా వెళ్తుంది. పెళ్లికి ముందులా కాకుండా డిఫరెంట్ కాన్సెప్ట్ లు ..పక్కాగా హిట్ అవుతాయి? అన్న కథలవైపే అడుగులు వేస్తోంది. ఏడాదికి ఒక సినిమా రిలీజ్ కు ఉ ండేలా చూసుకుంటుంది. ఆల్ఫా డిసెంబర్ లో రిలీజ్ కు రెడీ అవుతుంది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న చిత్రమిది. అలియా ప్రధాన పాత్రలో తెరకెక్కిన స్పై థ్రిల్లర్ ఇది. యశ్ రాజ్ ఫిలింస్ తొలిసారి ఓ లేడీతో స్పై సినిమా చేయడం విశేషం. ఈ సినిమా అనంతరం 2026లో అమ్మడు లవ్ అండ్ వార్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. అటు పై ఏ సినిమాలు చేస్తుంది? అన్నది లవ్ అండ్ వార్ చిత్రీకరణ ముగింపు దశకు వచ్చే వరకూ గానీ క్లారిటీ రాదు. అయితే అలియా భట్ ఇలా నెమ్మదిగా సినిమాలు చేయడంపై ఆమె అభిమానులు సోషల్ మీడియా వేదికగా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మునుపటిలా సినిమాలు చేయాలంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. మరి ఈ అభ్య ర్థనలను అలియాభట్ ఎలా తీసుకుంటుందో చూడాలి.

## రకుల్ మళ్లీ టాలీవుడ్ ప్రయత్నాలా?

రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ కి దూరమై నాలుగేళ్లు అవుతుంది. కొండపొలం తర్వాత అమ్మడు పూర్తిగా బాలీవుడ్ కే పరిమితమైంది. అక్కడ అవకాశాలతోనే నటిగా బిజీ అయింది. కానీ సక్సస్ లు మాత్రం చెంత చేరలేదు. అవకాశా లైతే ఒడిసి పట్టుకుంటుంది గానీ? విజయాలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. నాలుగేళ్లలో ఎనిమిది ..తొమ్మిది హిందీ సినిమాలు చేసింది. వాటిలో సక్సస్ భూతద్దం పెట్టి వెతికినా ఎక్కడా కనిపించదు. అయినా అవకాశాలు మాత్రం ఎక్కడా తగ్గలేదు. ప్రస్తుతం లైనప్ లో రెండు..మూడు సినిమాలున్నాయి. వాటిపై ఎలాంటి బజ్ కూడా లేదు.

**అప్పుడలా నిరాశతో నోరు జారి:** మరి ఇలాంటి ఫేజ్ లో ఉన్న రకుల్ మళ్లీ టాలీవుడ్ ప్రయత్నాలు మొదలు పెట్టిందా? అంటే అవుననే తెలుస్తోంది. అమ్మడు గత పరిచయస్తులకు మళ్లీ టచ్ లో కి వెళు ందిట. పాత మేనేజర్ ని మళ్లీ రంగంలోకి దించి దర్శక, నిర్మాతలకు టచ్ లో ఉండే ప్రయత్నం చేస్తుందిట. అలాగే రామ్ చరణ్-ఉపాసన



దంపతులకు రకుల్ మంచి స్నేహితురాలు అన్న సంగతి తెలిసిందే. అటువైపు నుంచి కూడా అమ్మడు చేయాల్సిన ప్రయత్నాలు చేస్తోందిట. మరి కంబ్యాక్ ఛాన్స్ ఎవరైనా ఇస్తారా? లేదా? అన్నది చూడాలి. వాస్తవానికి రకుల్ టాలీవుడ్ లో అవకాశాలు వస్తోన్న సమయంలోనే వదిలి బాలీవుడ్ కి వెళ్లింది. పాన్ ఇండియా సినిమాల్లో ఛాన్సులు రాలేదు? అన్న నిరాశ కూడా రకుల్ లో ఉంది.

**పూజాహెగ్డే కంటే పవర్ ఫుల్ గా విసిరిందే:** ఓ సందర్భంలో టాలీవుడ్ పై అసహనాన్ని కూడా వ్యక్తం చేసింది. కొందరికే పాన్ ఇండియా చిత్రాల్లో అవకాశాలు ఇస్తున్నారని..ఎంతో కాలంగా పరిశ్రమలో తన లాంటి సీనియర్లను పట్టించుకోలేదనే ఆవేదన వ్యక్తం చేసింది. ఆ విమర్శల్ని టాలీవుడ్ సీరియస్ గా తీసుకుంటే మాత్రం కంబ్యాక్ కష్టమే. పూజాహెగ్డే కూడా టాలీవుడ్ అవకాశాల్ని కాదని బాలీవుడ్ కి వెళ్లింది. అటుపై అంతే వేగంగా సౌత్ లో మళ్లీ అవకాశాలు కోసం ప్రయత్నిం చింది. లక్కీగా కోలీవుడ్ ఆదుకోవడంతో? కంబ్యాక్ అవ్వగలిగింది. కానీ టాలీవుడ్ మాత్రం పూజకు అవకాశాలివ్వడం లేదు.

**ప్రయత్నాలు ఫలించక:** ప్రయత్నాలు చేస్తున్నా? అవి అక్కడికే పరిమితమవుతున్నాయి తప్ప కన్సిడర్ చేసే పరిస్థితి కనిపించలేదు. మరి పూజాహెగ్డే కంటే రెండు ఆకులు ఎక్కువే విసిరిన రకుల్ కి టాలీవుడ్ అవకాశాలు ఇస్తుందా? లేదా? అన్నది చూడాలి.

ప్రస్తుతం రకుల్ హిందీలో దే దే ప్యార్ దే 2 లో నటిస్తోంది. దీంతో పాటు పతీ పత్నీ ఔర్ హూ దూ చిత్రంలోనూ నటిస్తోంది. ఇందులో దే దే ప్యార్ దే 2 వచ్చే నెలలో ప్రేక్షకుల ముందుకు రానుంది.




# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరిగే ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. వారిలో ఇవాళ వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు.

ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. అయితే, ఆయన మరణంతో ఉప ఎన్నిక రావడంతో ఈసారి పోటీలో ప్రధాన పార్టీలతోపాటు పెద్ద సంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు బరిలోకి దిగారు.

పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల పరిశీలనతోపాటు ఉపసంహరణ వరకు క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఈ ఉపఎన్నికలో చివరకు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

**భారీగా నామినేషన్లు ఎందుకంటే..?...** పలువురు అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తమ ఉద్యమానికి వేదికగా మలచుకునేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కారణాలు పేర్కొంటూ నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు చెల్లించిమరీ నామినేషన్లు వేశారు. ప్రధానంగా ప్రాంతీయ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేశారు. 12 మంది ప్రస్తుతం రంగంలో ఉన్నారు. యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది దాఖలు చేశారు. తగిన పరిహారం ఇవ్వలేదని, భూములు తిరిగి అప్పగించాలనేది వారి డిమాండ్. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒక సామాజిక వర్గం తరఫున 10 మంది నామినేషన్ వేశారు. ఉద్యోగ నియామక ప్రకటనలు లేవని నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ తరఫున 13 మంది నామినేషన్లు సమర్పించారు. పింఛన్లు సక్రమంగా రావడం లేదని పెన్షన్‌దారుల తరఫున 9 మంది సీనియర్ సిటిజన్లు నామినేషన్లు వేశారు. తెలంగాణ ఉద్యమకారుల తరఫున ఒకరు సమర్పించారు.




కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే.

ఈ ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు ఉన్నాయి. రూ.23,120 ఫైన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది.


**బస్సు ఫిట్‌గానే ఉంది: రవాణాశాఖ...** ప్రమాదానికి గురైన బస్సు DD01 N9490 నంబరుతో రిజిస్టర్ అయినట్లు ఏపీ రవాణా శాఖ వెల్లడించింది. ఈ బస్సు ఫిట్‌గానే ఉందని, బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయని తెలిపింది. "కావేరి ట్రావెల్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేసి బస్సు నడుపుతున్నారు. 2018 మే 2న బస్సును డామన్ డయ్యూలో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ బస్సుకు 2030 ఏప్రిల్ 30 వరకు టూరిస్ట్ పర్మిట్ జారీ అయ్యింది. ప్రమాదానికి గురైన బస్సు ఫిట్‌గా ఉంది. 2027 మార్చి 31 వరకు ఫిట్‌నెస్ ఉంది. 2026 ఏప్రిల్ 20 వరకు బస్సుకు ఇన్సూరెన్స్ ఉంది. బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయి. అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. దర్యాప్తు నివేదిక మేరకు భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం" అని రవాణా శాఖ పేర్కొంది. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిప్రమాదానికి బస్సులోనే పలువురు సజీవ దహనం అయ్యారు.




హైదరాబాద్: కర్నూలు బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణ చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నుంచి బస్సు బయలుదేరిన నేపథ్యంలో.. ఘటనపై విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. అవసరమైన సహాయక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు బస్సుల వేగ నియంత్రణకు చర్యలు చేపడతామని తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో త్వరలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక మంత్రుల సమావేశం నిర్వహిస్తామన్నారు. బస్సుల్లో భద్రతా చర్యలపై నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు. ఓవర్ స్పీడ్ నియంత్రణకు కమిటీ వేస్తామని తెలిపారు.

ప్రైవేటు ట్రావెల్స్ మధ్య అనారోగ్యకర పోటీ ఉందని, దాన్ని నివారిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలు వచ్చాక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

# కర్నూలు దుర్ఘటన.. మెదక్ జిల్లాకు చెందిన తల్లీకుమార్తె దుర్మరణం



మెదక్: కర్నూలు బస్సు ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన తల్లీకుమార్తె మృతిచెందారు. మృతులను శివ్వాయిపల్లికి చెందిన సంధ్యారాణి (43), చందన (23)గా గుర్తించారు. కుమార్తెను బెంగళూరులో విడిచిపెట్టేందుకు సంధ్యారాణి కూడా వేమూరి ట్రావెల్స్ బస్సులో బయల్దేరారు. ఈ క్రమంలో కర్నూలులో బస్సు ప్రమాదానికి గురికావడంతో మృతిచెందారు. భర్త ఆనంద్‌కుమార్‌తో కలిసి సంధ్యారాణి మస్కట్‌లో ఉంటున్నారు. కుమార్తె చందన బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. వివాహ వేడుక కోసం సంధ్యారాణి దంపతులు గ్రామానికి వచ్చారు. వారం క్రితం ఆనంద్‌కుమార్ తిరిగి మస్కట్ వెళ్లిపోయారు. జ్వరం రావడంతో సంధ్యారాణి వెళ్లకుండా ఆగిపోయారు. కుమార్తెను బెంగళూరులో విడిచిపెట్టి మస్కట్ వెళ్లాలని ఆమె భావించారు. ఈ క్రమంలో బస్సులో వెళ్తుండగా జరిగిన ఘోర దుర్ఘటనలో వారిద్దరూ చనిపోయారు.

# కర్నూలు ప్రమాదం.. రహదారులపై భద్రతా చర్యలను బలోపేతం చేయాలి: తెలంగాణ గవర్నర్

హైదరాబాద్: కర్నూలు బస్సు ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనపై తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం.. రహదారులపై భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తోందన్నారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో శుక్రవారం వేమూరి కావేరి మంటలు చెలరేగాయి. బైక్‌ను బస్సు ఢీకొట్టడంతో అగ్నిప్రమాదం జరిగి 19 మంది సజీవ దహనమయ్యారు.



# కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆరా

హైదరాబాద్: కర్నూలు జిల్లా బస్సు ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏపీ అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనపై సీఎస్, డీజీపీతో మాట్లాడారు. తక్షణమే హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. గద్వాల కలెక్టర్, ఎస్పీ ఘటనాస్థలికి వెళ్లాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. బైక్‌ను బస్సు ఢీకొట్టడంతో అగ్నిప్రమాదం జరిగి 19 మంది సజీవ దహనమయ్యారు.



# కర్నూలు మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా...




హైదరాబాద్: కర్నూలు బస్సు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు క్షతగాత్రులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రమాదంలో మృతిచెందిన తెలంగాణ పౌరులకు ఎక్స్‌గ్రేషియాను ఇవ్వనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

కాగా, ప్రధాని మోదీ కూడా తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ.. ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన విషయం తెలిసిందే. బస్సు ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ. 50వేల చొప్పున పరిహారం ప్రకటించారు. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది.

# జూబ్లీహిల్స్ ప్రచారంలో స్పీడ్ పెంచిన కాంగ్రెస్..



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై ఆసక్తి కొనసాగుతోంది. నామినేషన్ల పర్వం ముగియటంతో పార్టీల ప్రచారాలు హోరెత్తుతున్నాయి. సిట్టింగ్ సీటు దక్కించుకోవాలని బీఆర్ఎస్, జూబ్లీహిల్స్‌లో గెలవాలని అధికార పార్టీ, సత్తా చాటాలని బీజేపీలు తమ వ్యూహాలు రచిస్తున్నాయి. డివిజన్లలో క్షేత్ర స్థాయిలో క్యాంపెయినింగ్ చేస్తూ.. అన్ని పార్టీలు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. అయితే జూబ్లీహిల్స్ సీటు ఎలాగైనా దక్కించుకోవాలని ప్రచారంపై అధికార పార్టీ కాంగ్రెస్ స్పీడ్ పెంచినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రేపటి(శనివారం) నుంచి జూబ్లీహిల్స్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేయాలని నాయకులకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ డివిజన్‌కు ఇద్దరు మంత్రుల చొప్పున 13 మంది మంత్రులకు ప్రచార బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. ప్రతి మంత్రికి సహాయకులుగా నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, 6 మంది కార్పొరేషన్ చైర్మన్లు ఉండనున్నారు. ప్రతి బూత్ బాధ్యతను జిల్లా స్థాయి నేతకు అప్పగించినట్లు టీపీసీసీ చీఫ్ పేర్కొన్నారు.

ప్రతిరోజూ చేసిన ప్రచార కార్యక్రమాలను.. గాంధీ భవన్ వార్ రూమ్‌కు పంపాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు మొత్తం 150కి పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా, ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విస్తృతంగా ప్రచారాలు చేస్తున్నారు. ప్రత్యర్థుల మధ్య పోటాపోటీ ఉండటంతో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ రోజురోజుకి పెరుగుతోంది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పోలింగ్.. 14న కౌంటింగ్ జరగనున్న విషయం తెలిసిందే.

# కర్నూలు ప్రమాదం... ట్రావెల్స్ సంస్థలపై రామచందర్ రావు సీరియస్

హైదరాబాద్, అక్టోబర్ 24: కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు స్పందించారు. హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురైన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య చికిత్సను ప్రభుత్వం వెంటనే అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మరల జరగకుండా ప్రభుత్వం సమగ్ర నియంత్రణ చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని రామచందర్ రావు వెల్లడించారు.

**విషాదకరం: బీజేపీఎల్పీ నేత..** కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్ ఘటనలో ఎక్కువ సంఖ్యలో మృతులు ఉండటం విషాదకరమన్నారు. మృతులకు తీవ్ర సంతాపం తెలిపారు.

మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.




భారత సంతతికి చెందిన మెహుల్ గోస్వామి అనే వ్యక్తి అమెరికాలో అరెస్టయ్యాడు. మూన్‌లైటింగ్ చేయడమే అతడి అరెస్టుకు కారణం. ఒక వ్యక్తి సాధారణ ఉద్యోగ సమయం తర్వాత కూడా మరో ఉద్యోగం చేయడాన్ని మూన్‌లైటింగ్ అంటారు. అసలేం జరిగిందంటే.. న్యూయార్క్ వాసి అయిన గోస్వామి న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. ఇది అతడి ప్రాథమిక ఉద్యోగం. ఈ సమయంలో అతడు మాల్టాలోని గ్లోబల్‌ఫౌండ్రీస్ సెమీకండక్టర్ కంపెనీలో కాంట్రాక్టర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. 2022 నుంచి అతడు ఇందులో కాంట్రాక్టర్‌గా ఉన్నాడు. ఇ మెయిల్‌ల ఆధారంగా గోస్వామి మూన్‌లైటింగ్‌కు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్ర నిధుల్లోంచి దాదాపు రూ.44 లక్షలు దొంగతనం కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాల్సిన సమయంలోనే.. ప్రైవేటు కంపెనీ కోసం పనిచేస్తుండటంతో అక్టోబరు 15న అధికారులు అతడిని అరెస్టు చేశారు. 'నిజాయతీగా సేవ చేసేందుకే ప్రభుత్వ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగిస్తారు. గోస్వామి దాన్ని తీవ్రంగా ఉల్లంఘించాడు. రాష్ట్రం కోసం పనిచేస్తున్నా అని చెప్పుకుంటూ.. మరో కంపెనీ కోసం పూర్తి సమయం కేటాయించాడు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో సహా ప్రజా వనరులను దుర్వినియోగం చేయడమే' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ లూసీ లాంగ్ పేర్కొన్నారు. ఇటీవల అధికారులు గోస్వామిని కోర్టులో హాజరుపరచగా.. అతడు బెయిల్ లేకుండానే విడుదలయ్యాడు. అయితే, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతుంది. ఇందులో నేరం రుజువైతే అతడికి 15 ఏళ్లు జైలు శిక్ష పడుతుంది. ఇక, గోస్వామి అరెస్టు నేపథ్యంలో మూన్‌లైటింగ్ గురించి మరోసారి చర్చ జరుగుతుంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com